




# విజయభాను









విశాఖపట్నం, బుధవారం 22-11-2017 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 41 సంచిక : 69 పేజీలు : 8 వెల : 1 రూపాయి


### లాభసాటి వ్యవసాయం కోసమే
## విత్తనోత్పత్తి కేంద్రం

- అగ్రిటెక్ సదస్సులో నూతన ఆవిష్కరణలు
- కర్నూలులో విత్తనోత్పత్తి కేంద్రం
- డ్రోన్‌లతో భూసార పరీక్షలు
- అసెంబ్లీలో సీఎం చంద్రబాబు



అమరావతి: వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు చిన్నకమతాల అనుసంధానంపై దృష్టిపెడతామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. మంగళవారం అసెంబ్లీలో వ్యవసాయం, అనుబంధ రంగాలపై చర్చ జరిపారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. అగ్రిటెక్ సదస్సులో 259 నూతన ఆవిష్కరణలు వచ్చాయని తెలిపారు. ఈ ఏడాది లక్షన్నర ఎకరాల్లో పత్తిసాగు తగ్గించగలిగామని చెప్పారు. పండ్ల తోటల విస్తీర్ణాన్ని కోటి ఎకరాలకు పెంచడమే లక్ష్యమని పేర్కొన్నారు.

కర్నూలును విత్తనోత్పత్తి కేంద్రంగా తయారు చేయాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సీఎం వెల్లడించారు. భూసార పరీక్షల కోసం డ్రోన్ వినియోగించే యోచనలో తరువాయి 2లో

### మెట్రో ట్రైన్ వస్తోందంటే..
# ట్రావెల్స్, క్యాబ్‌లకు గుండెదడ!



- ప్రైవేట్ ట్రావెల్స్ ఆదాయానికి గండి
- మెట్రో స్టేషన్లలోనే సకల సౌకర్యాల మార్కెటింగ్!
- పిల్లల సరదా కోసం గేమింగ్ జోన్లు..
- మెట్రోలో ప్రయాణంతో సమయం, డబ్బు ఆదా..

న్యూఢిల్లీ: మెట్రో రాకతో ప్రయివేట్ ట్రావెల్స్, క్యాబ్‌ల పనైపోయిందా?.. ఇప్పటి వరకు వీటిపై ఆధారపడిన ప్రజలు ఇప్పుడింక వీటి వంక చూడరా?.. ఒకవైపు లోకల్ ట్రైన్స్, మరో వైపు పరుగులు పెట్టబోతున్న మెట్రో.. మరి ప్రయివేట్ ట్రావెల్స్, క్యాబ్ అసోసియేషన్ల పరిస్థితి ఏంటి?.. భాగ్యనగరంలో ప్రయివేట్ ట్రావెల్స్, క్యాబ్ ల హవా గురించి చెప్పనక్కర్లేదు.. ఎక్కడికి వెళ్లాలన్నఓలా, ఊబర్, జీ క్యాబ్ ఇలా ఏదో ఒక క్యాబ్ ని బుక్ చేసుకోవాల్సిన పరిస్థితి.. కొన్ని కొన్ని సందర్భాల్లో ఛార్జీలు ఎంతైనా సరే ప్రయాణించేవారు.. దీంతో క్యాబ్స్ డ్రైవర్లు, ప్రయివేట్ ట్రావెల్స్‌ల ఆదాయం మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతుండేది.. అయితే మెట్రోతో ఇప్పుడు వారికి ఆదాయానికి గండి పడడం ఖాయమని పరిశీలకులు అభిప్రాయపడ్డారు.

ఈ నెల 28న భాగ్యనగరంలో మెట్రో రైలు పరుగులు పెట్టబోతున్న సంగతి తెలిసిందే.. నాగోల్ - మియాపూర్ వరకు మెట్రో రైలును ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రారంభిస్తారని స్వయానా మంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారు. దీంతో ఎప్పుడెప్పుడు మెట్రోలో ప్రయాణిద్దామా అని భాగ్యనగర వాసులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.. దీంతో ప్రయివేట్ ట్రావెల్స్, క్యాబ్‌ల వాడకం దాదాపు తగ్గిపోనుంది.. తరువాయి 2లో

# బాబూ.. మొసలి కన్నీరొద్దు
### బాధ్యులపై చర్యలు తీసుకోవాలి



నెల్లూరు: కృష్ణా జిల్లా ఇబ్రహీపట్నంలోని ఫెర్రీఘాట్ వద్ద జరిగిన పడవ ప్రమాదంపై సీఎం చంద్రబాబుకు సీపీఐ నేత నారాయణ బహిరంగ లేఖ లేశారు.

ఘటనలు జరిగినప్పుడు మొసలి కన్నీరు పెట్టడం కాదు.. బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తమ కుటుంబం మాదిరిగా మరెవరికీ గుండె కోత ఉండకూడదన్నారు. ధార్మిక అంశాల జోలికి ప్రభుత్వం పోవాల్సిన అవసరం లేదన్నారు. టూరిజంపై సమగ్ర పరిశీలన చేయాల్సిన అవసరం ఉందని నారాయణ తన లేఖలో పేర్కొన్నారు.

# ఇస్లామిక్ స్టేట్‌ను ఊడ్చేశాం
### ఇరాన్ అధ్యక్షుడు హసన్ రూనీ



బిరుట్ : ప్రపంచాన్ని గడగడలాడించిన ఇస్లామిక్ స్టేట్.. ఇక పూర్తిగా ముగిసిన చరిత్ర అని ఇరాన్ అధ్యక్షుడు హసన్ రూనీ మంగళవారం ప్రకటించారు. ఇస్లామిక్ స్టేట్‌ను దేశం నుంచి పూర్తిగా తుడిచేశామని, ఈ విషయాన్ని ప్రకటించేందుకు గర్వంగా ఉందని రెవెల్యూషనరీ గార్డ్స్ కమాండర్ మేజర్ జనరల్ ఖసీమ్ సొలేమాని పేర్కొన్నారు.

కొన్నేళ్లుగా ఇరాన్‌లో ఇస్లామిక్ స్టేట్ విస్తృతంగా విస్తరించింది. ఈ క్రమంలో పలు ఉగ్రవాద దాడులను ఇరాన్ ఎదుర్కొంది. ఈ నేపథ్యంలో ఇస్లామిక్ స్టేట్‌పై ఇరాన్ యుద్ధం ప్రకటించింది. కొన్ని తరువాయి 2లో

# చైనా టార్గెట్ ఎవరు?



న్యూఢిల్లీ: ధ్వని కంటే పది రెట్లు వేగంగా ప్రయాణించే క్షిపణి ప్రయోగం వెనుక ఉద్దేశమేమిటి? చైనా టార్గెట్ ఎవరు? భారత్‌ను భయపెట్టడమే ధ్యేయమా? అమెరికా అంతు చూస్తానని హెచ్చరించడమే లక్ష్యమా? ప్రపంచంలో ఏ దేశంపైనైనా విరుచుకపడగలనని ధైర్యమా? చైనా వారి డాంగ్ ఫెంగ్ ఫార్టీవన్ మన అగ్ని ఫైవ్‌కు ఉన్న పోలికలేంటి? తేడాలేంటి? చైనా నిత్యం యుద్ధ సన్నాహాల్లో ఉంటుందా? ఎప్పటికప్పుడు అధునాతన ఆయుధాలను సమకూర్చుకుంటూ పొరుగు దేశాలను భయపెడుతుందా? ఎప్పటికప్పుడు అధునాతన ఆయుధాలను సమకూర్చుకుంటూ పొరుగు దేశాలను భయపెడుతుందా? ఇండియా, దక్షిణ కొరియా, అమెరికా ఏ దేశాన్నైనా చైనా టార్గెట్ చేయగలదా? డ్రాగన్ కంట్రీ ఆయుధ సంపత్తిలో నెక్స్ట్ జనరేషన్ వచ్చేసింది. ప్రపంచంలోని ఏ మూలన ఉన్న లక్ష్యాన్నైనా అవలీలగా ఛేదించే క్షిపణులను చైనా తన అమ్ములపొదిలో భద్రపరుచుకుంటోంది. డాంగ్ ఫెంగ్ ఫార్టీవన్.. తాజాగా చైనా ప్రయోగించిన క్షిపణి. శత్రుదేశ క్షిపణి హెచ్చరికల వ్యవస్థను, రక్షణ వ్యవస్థలను ఏమార్చి దాడులు చేయగల క్షిపణి అది.

డాంగ్ ఫెంగ్ 41 ఒక ఖండాంతర క్షిపణి. పన్నెండు వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్ష్యాలను అవలీలగా ఛేదిస్తుంది. ఏకకాలంలో పది అణ్వస్త్రాలను మోసుకెళ్తుంది. ప్రయోగానంతరం.. అవన్నీ క్షిపణి నుంచి విడిపోయి.. నిర్దేశించిన రీతిలో వేరువేరు లక్ష్యాలను ఛేదిస్తాయి. అమెరికాలోని ఏ నగరంపైనైనా డాంగ్ పెంగ్ 41తో అణు దాడి చేసే వీలుంది. నిజానికి డాంగ్ ఫెంగ్ సిరీస్‌లో చైనా అనేక క్షిపణులను తయారు చేసుకుంది. డాంగ్ ఫెంగ్ 26, డాంగ్ ఫెంగ్ 21డీ, ఇలా చెప్పుకుంటూ పోతే అనేక ఖండాంతర క్షిపణులను డ్రాగన్ కంట్రీ సిద్ధం చేసుకుంది. డాంగ్ ఫెంగ్ 41పై 2012 నుంచి పరీక్షలు నిర్వహిస్తూనే ఉంది. తొలుత అత్యంత రహస్యంగా తరువాయి 2లో

# ఐసీజేలో భారత్ విజయం
### న్యాయమూర్తిగా మళ్లీ భండారి ఎన్నిక



యునైటెడ్ నేషన్స్: అంతర్జాతీయ న్యాయస్థానం (ఐసీజే) ఎన్నికల్లో భారత్‌కు చెందిన దల్వీర్ భండారి మరోసారి న్యాయమూర్తిగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల్లో భండారి, బ్రిటన్‌కు చెందిన జస్టిస్ క్రిస్టోఫర్ గ్రీన్‌వుడ్ మధ్య గట్టిపోటీ నెలకొన్న విషయం తెలిసిందే. అయితే చివర్లో బ్రిటన్ తన అభ్యర్థిని ఉపసంహరించుకోవడంతో భండారి ఎన్నికయ్యారు.

నెదర్లాండ్స్‌లోని ది హేగ్‌లో ఉన్న అంతర్జాతీయ న్యాయస్థానంలో 15 మంది న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం ఉంటుంది. వీరి పదవీకాలం తొమ్మిది సంవత్సరాలు. మూడేళ్లకోసారి వీరిలో ప్రతి ఐదుగురి స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తుంటారు. ఐరాసలోని జనరల్ అసెంబ్లీలో గల 193 మంది, భద్రతామండలిలోని 15 మంది ఈ న్యాయమూర్తులను ఎన్నుకొంటారు. ఈ ఎన్నికల్లో గెలవాలంటే జనరల్ అసెంబ్లీలో కనీసం 97ఓట్లు, భద్రతామండలిలో 8 ఓట్ల మెజార్టీ రావాలి. రెండింటిలో మెజార్టీ ఉన్న వారినే తీసుకుంటారు.

భండారి, గ్రీన్‌వుడ్‌లతో పాటు జస్టిస్ రోనీ అబ్రహం(ఫ్రాన్స్), జస్టిస్ అంటానియో (బ్రెజిల్), జస్టిస్ అబ్దుల్ ఖావీ యూసఫ్ (సోమాలియా)ల పదవీకాలం 2018 ఫిబ్రవరి 5తో ముగియనుంది. దీంతో ఈ స్థానాలకు ఎన్నికలు తరువాయి 2లో

# 'కొలువులకై కొట్లాట'

- సన్నాహక సమావేశం
- సమావేశానికి అనుమతి 'నో'
- హైకోర్టును ఆశ్రయించిన కోదండరాం




సంగారెడ్డి: తెలంగాణ రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిన కోసం తెలంగాణ రాజకీయ జేఏసీ చేపట్టిన కొలువులకై కోట్లాట సన్నాహక సమావేశం సంగారెడ్డిలో జరిగింది. ఈ సమావేశానికి టీజేఏసీ చైర్మన్ కోదండరాం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తరువాయి 2లో






### టేకిట్ ఈజీ



బాబు అబద్ధాలపుట్ట అని జగన్..
జగన్ దగాకోరు అని బాబు..
ఇరువురు అంటుంటే
ఎవరి మాటలు నమ్మాలోయ్!!

# బాబు అబద్ధాల పుట్ట
### అలాంటి వ్యక్తిని ఎన్నుకోకూడదు
### ప్రజాసంకల్పయాత్రలో జగన్



కర్నూలు: ఎన్నికల సమయంలో ప్రజలకు ఎన్నో వాగ్దానాలు ఇచ్చిన చంద్రబాబు తన నాలుగేళ్ల పాలనలో ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని, ఈ నాలుగేళ్లలో ఎన్నో దారుణాలు, మోసాలు చేస్తూ.. అబద్ధాలు చెప్తున్న వ్యక్తి ముఖ్యమంత్రి స్థానంలో ఉన్నారని, ఇలాంటి వ్యక్తిని మళ్లీ పొరపాటున కూడా ఎన్నుకోవద్దని, ఒకవేళ ఎన్నుకుంటే విశ్వసనీయత అనే పదానికి అర్థం, రాజకీయ వ్యవస్థకు విలువ ఉండవని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ తరువాయి 2లో

# ఘనంగా ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం

భీమునిపట్నం : మండలపరిషత్ ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా భీమునిపట్నం, అనందపురం, పద్మనాభం మండలాల్లో ఉన్న మత్స్యకారులుతో భీమిలి మండలం ప్రజాపరిషత్ కార్యాలయంలో మత్స్య అధికారి డాక్టర్ పి .శ్రీవాసరావు ఆద్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంకు ముఖ్యఅతిదిగా భీమిలి మండలాద్యక్షులురాలు యరబాల. క్రిష్ణవేణి, జడ్పిటిసి సరగడ.అప్పారావు, ఎం.పి.డి.ఓ.కె. హరిప్రసాద్ హాజరు అయ్యారు. ఈ సందర్భంగా మత్స్యశాఖ సంయుక్త సంచాలుకులు డాక్టర్ పి.శంకరరావు మాట్లాడుతూ మత్స్యకారులు అవగాహనతో భవిష్యత్తుతరాలకు అంతరించిపోతున్న మత్స్యసంపదను దృష్టిలో వుంచుకొని నిర్మణాత్మకమైన చేపల వేటను సాగించాలని, ఆయన కోరారు. సముద్ర కాలుష్యం చేపలవేటలో సుస్థిరతను సాధించాలని, సముద్ర పర్యావరణమును పరిరక్షించాలని కోరారు. అనంతరం ప్రభుత్వ పధకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా తోటవీదికి చెందిన కాసరపు ఎల్లాజీ కి బ్లూ రివల్యుషన్ పధకం 2016-17 ద్వారా యాభై శాతం రాయతితో లక్ష యూనిట్ విలువ గల ఎఫ్ .ఆర్ .పి. బోటు ని మరియు వలను భీమిలి మండలాద్యక్షులురాలు యరబాల.క్రిష్ణవేణి అందజేసారు. ఇందులో భీమిలి టౌన్ టి.డి.పి. అధ్యక్షులు గంటా నూకరాజు, మెరైన్ సి,ఐ లక్ష్మణరావు, మత్స్యకార నాయుకులు గరికిన.పరుశురాం,వాసుపల్లి కొండబాబు, చురకల.రమణ, టిడిపి.నాయకులు జి.పోలి రాజు, దాసరి. వెంకటేష్ , డక్కన్.శ్రీను మత్స్యకార నాయుకులు తదీతరులు పాల్గొన్నారు.

# ముగిసిన జాతీయ బాలల దినోత్సవ వారోత్సవాలు




ఆలమూరు : స్థానిక శ్రమ స్వచ్ఛంద సేవా సంస్థ వారి ఆధ్వర్యంలో నవంబర్-14 నుండి ఆలమూరు, కపిలేశ్వరపురం మండలాల్లో నిర్వహించిన జాతీయ బాలల దినోత్సవ వారోత్సవాలు మంగళవారంతో ముగిసాయి. ఈ కార్యక్రమంలో భాగంగా ఆలమూరు మండల పరిధి జొన్నాడ, నర్సిపూడి, చెముడులంక గ్రామాలలోను, అలాగే కపిలేశ్వరపురం మండలంలో వల్లూరు, కపిలేశ్వరపురం, టేకి, మాచర వాకతిప్ప గ్రామాలలో జెడ్‌పి హైస్కూళ్ల లో సదస్సులు, ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో పాల్గొన్న పలువురు వక్తలు మాట్లాడుతూ బాలలకు వున్న హక్కులు, బాధ్యతలను వివరించి, భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. అలాగే విద్య ప్రాముఖ్యత, బాల్య వివాహాలు, బాలకార్మికులు, బాలల అక్రమ రవాణాను తగ్గించే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని, విద్యార్ధులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఉపాధ్యాయులు, ఆయా పాఠశాలల విద్యా కమిటీ సభ్యులు, విద్యార్ధులు, సంస్థ ప్రతినిధులు, జి.వి.ఎ. దుర్గాదేవి, నాగేశ్వరి, వై.రమణయ్య, టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

# ఈ నెల 26న ఎమ్మెల్యే వాడపల్లికి పాదయాత్ర

## కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలి

## - మండల కన్వీనర్ దొమ్మేటి అర్జునరావు



రావులపాలెం : ఈ నెల 26 ఆదివారం రోజున స్థానిక శాసన సభ్యులు చిర్ల జగ్గిరెడ్డి తలపెట్టి వాడపల్లి పాదయాత్రకు మద్దతుగా రావులపాలెం వైసిపి కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మండల కన్వీనర్ దొమ్మేటి అర్జునరావు పిలుపునిచ్చారు. ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ నియోజక వర్గ ప్రజలు సుభిక్షంగా ఉండాలని, జగన్ పాదయాత్రకు మద్దతుగా ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవాలయమునకు పాదయాత్ర చేస్తున్నారని ఈ పాదయాత్రకు పార్టీ అభిమానులు, కార్యకర్తలు తరలి రావాలని పిలుపునిచ్చిరు.

ఈ కార్యక్రమంలో ఎమ్‌పిపి కోట చెల్లయ్య, జెడ్‌పిటిసి సాకా ప్రసన్నకుమార్, వైస్ ఎమ్‌పిపి దండు వెంకట సుబ్రహ్మణ్య వర్మ, మునిరెడ్డి, బొక్కా వెంకటలక్ష్మి, కొండేపూడి రామకృష్ణ, బొక్కా ప్రసాద్, కప్పల నాగేశ్వరరావు, ద్వారంపూడి సుధాకరరెడ్డి, దంగేటి మాణిక్యాలరావు, పి. రామారావు, కోనాల రాజు, జక్కంపూడి లక్ష్మీనారాయణ, పులుగుర్త రామారావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్ధులు మొక్కలు పంపిణి



భీమునిపట్నం : భీమిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్ధులు 1980-1981 బ్యాచ్ పదవతరగతి చదివిన వారంతా ఎం.వి.మహిదర్ ఆద్వర్యంలో హై స్కూల్‌కు సిమెంట్ రోడ్ నిర్మించారు. పచ్చధనం పరిరక్షణలో బాగంగా రోడ్ కి ఇరువైపులా మొక్కలు నాటి ట్రీగార్డ్సులు ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమంలో హై స్కూల్ హెచ్.ఎం. జి.వెంకటరావు పూర్వ విద్యార్ధులు డి.వి.ఎస్ .రామకృష్ణ, మైలపల్లి.లక్ష్మణరావు, డి.శ్రీనివాసరావు , డి.గోపి , ఎస్.ఎస్.శంకర్, జి.మురళి తదితరులు పాల్గొన్నారు.

# రత్నగిరిపై అమ్మమ్మగారి ఇల్లు సినీ సందడి



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి సన్నిధిలో సోమవారం, మంగళవారం నుండి అమ్మమ్మగారి ఇల్లు సినిమా ఘాటింగ్ జరిపారు. ఈ చిత్రంలో నాగశౌర్య, బేబిషామిలి హీరో, హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రానికి సుందర్ సూర్య దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో నటించేందుకు వచ్చిన సినీ నటులు రావు.రమేష్, శివాజీ రాజా, ఏడిద శ్రీరామ్, షకలక శంకర్, సుధ, హేమ తదితరులు వచ్చారు. ఈ సందర్భంగా దర్శకుడు సుందర్ సూర్య మాట్లాడుతూ ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది జనవరిలో విడుదల చేస్తామని తెలిపారు.

# ఘనంగా ముగిసిన చతుర్వేద పారాయణం



రావులపాలెం : రావులపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీ రుక్మిణి సత్య భామా సమేత శ్రీ వేణు గోపాలస్వామి వారి ఆలయంలో టిటిడి సూపర్‌వైజర్ గుళ్ళపల్లి దత్తాత్రేయ ఘనాపాటి వారి ఆద్వర్యంలో చతుర్వేద పారాయణం జరిగింది. కోనసీమ పరిసర ప్రాంతాల్లో తిరుమల తిరుపతి దేవస్థానం వారిచే నియమించబడిన చతుర్వేద పండితులచే లోక కళ్యాణార్ధం, గోసంరక్షణార్ధమై ఈ నెల 19 న ప్రారంభమైన చతురేవద పారాయణ కార్యక్రమం మంగళవారం ముగిసిందని ఆయన తెలిపారు. ఈ పారాయణంలో వేద పండితులు కలగ శ్రీనివాస శర్మ అవధాని, పెడసనగంటి సీతారామమూర్తి శర్మ అవధాని, వేద పండితులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# స్కూల్ కాంప్లెక్స్ సమావేశం

నర్సీపట్నం : వేములపూడి ప్రాథమిక పాఠశాలల సముదాయ సమావేశం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిబంది. ఈ సమావేశంలో స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ శెట్టి మోహనరావు మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల రోలును పెంచాలన్నారు. ఇంగ్లీషు సబ్జెక్టుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలియజేశారు. ఈ సమావేశంలో రిసోర్స్ పర్సన్ ఆళ్ల వరప్రసాద్, ఏ.శ్రీనువాసబాబు, సిఆర్పీ వెంకట్రావు, వేములపూడి క్లస్టర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సొసైటీకి, బ్రహ్మణ సంఘానికి సంబంధం లేదు

## నగర బ్రహ్మణ అధ్యక్షులు రాయవరపు వెల్లడి



కాకినాడ : స్థానిక అచ్చంపేట సెంటర్‌లో ఏర్పాటు చేసిన బ్రహ్మణ కార్పొరేషన్ క్రెడిట్ సొసైటీకి, నగర బ్రహ్మణ సంఘానికి ఎటువంటి సంబంధం లేదని నగర బ్రహ్మణ సంఘం అధ్యక్షులు రాయవరపు సీతారామాంజనేయులు ఒక ప్రకటనలో వెల్లడించారు. స్థానిక విద్యుత్‌నగర్ చల్లావారి కల్యాణమండపంలో బ్రహ్మణ సంఘ కార్యాలయంలో సంఘ సభ్యులతో జరిగిన సమావేశంలో సీతారామాంజనేయులు మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా నగర బ్రహ్మణ సంఘం పార్టీలకు అతీతంగా బ్రహ్మణ శ్రేయస్సుకు కృషి చేస్తున్న విషయాన్ని తెలియజేస్తూ, కొత్తగా ఏర్పడిన బ్రహ్మణ క్రెడిట్ సొసైటీ వసూలు చేస్తున్న సభ్యత్వ రుసుం రూ.600లకు తమ సంఘం బాధ్యత వహించదని తెలియజేసారు. ఇటువంటి వసూళ్ళకు బ్రహ్మణ సంఘం బాధ్యత వహించదని, రూ.600లు చెల్లించిన వారు క్రెడిట్ సొసైటీని సంప్రదించాలని తెలిపారు. నగరంలో రూ.600లు చెల్లించిన బ్రహ్మణులు సంఘాన్ని సంప్రదిస్తున్న విషయాన్ని గుర్తు చేస్తూ క్రెడిట్ సొసైటీ వసూలు చేస్తున్న వసూళ్ళు ఆ సొసైటీ వ్యక్తిగతమన్నారు. ఈ సందర్భంగా సీతారామాంజనేయులు మాట్లాడుతూ ఈ నెల 19న ఏర్పాటు చేసిన బ్రహ్మణ క్రెడిట్ సొసైటీకి నగర బ్రహ్మణ సేవా సంఘాన్ని విస్మరించి కనీస ఆహ్వానం లేకపోవడం విచారకరమన్నారు. బ్రహ్మణుల అభివృద్ధికి ప్రభుత్వం నెలకొల్పిన ఈ సొసైటీని కొంత మంది తమ స్వార్థానికి రాజకీయం చేయడం తగదన్నారు. ఈ విషయంపై రాష్ట్ర బ్రహ్మణ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ఆనంద సూర్య గుర్తించి ఇప్పటికైనా ప్రభుత్వం బ్రహ్మణుల అభివృద్ధికి ఏర్పాటు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు ఏ కొంత మంది అనుభవించకుండా ఆ ఫలాలు బ్రహ్మణులందరికీ చెందేవిధంగా చర్యలు తీసుకోవాలని సీతారామాంజనేయులు కోరారు. ఈ సమావేశంలో కార్యదర్శి వాడ్రేవు సుబ్రహ్మణ్యం, కోశాధికారి వైఏపిఆర్ మూర్తి, సిసిఎస్ రాజు, ప్రబల మల్లిఖార్జునరావు, రామనాథం, పివీ రంగారావు, ఎస్‌వి సోమసుందరం, బ్రహ్మణ ప్రముఖులు పాల్గొన్నారు.

# వాసుదేవకు హిందీ ప్రవీణ పురస్కారం

విశాఖపట్నం : నగరంలోని పాత బస్తీ చిన్నంవారి వీధికి చెందిన కట్టమూరి వాసుదేవకు ఇటీవల చెన్నైలో దక్షిణ భారత హిందీ ప్రచార సభ నిర్వ హించిన కార్యక్రమంలో భారత ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు చేతులమీదుగా హిందీ ప్రవీణ పురస్కారం లభించింది. శివశివాని పబ్లిక్ స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్న వాసుదేవ ప్రాథమిక విద్యనుంచే హిందీ ప్రచార సభ సభ్యురాలు గ్రంథి రత్నమాల వద్ద తర్ఫీదు పొందారు. చిన్న వయస్సులోనే హిందీ ప్రవీణ ఉత్తరార్థ పూర్తి చేసి అరుదైన పురస్కారాన్ని అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందని తల్లిదండ్రులు కట్టమూరి గీత, భయంకర్‌లు ఆనందం వ్యక్తం చేశారు.

మొదటి పేజీ తరువాయి

## చైనా టార్గెట్ ఎవరు?

ఈ పరీక్షలు నిర్వహించినప్పటికీ 2016లో యూఎస్ శాటిలైట్ ట్రాకింగ్ సిస్టమ్ దాన్ని కనిపెట్టేసింది. ఇప్పుడు తాజాగా నవంబర్ మొదటి వారంలో డాంగ్ ఫెంగ్ 41 ప్రయోగం జరిగినట్లు చైనీస్ మీడియా స్వయంగా ప్రకటించింది.

డాంగ్ ఫెంగ్ 41 వచ్చే ఏడాది నాటికి చైనా సైన్యం అయిన పీపుల్స్ లిబరేషన్ ఆర్మీకి అప్పగిస్తారు. అప్పటి నుంచి ఎప్పుడైనా అధికారికంగా ప్రయోగించే వీలుంటుంది. డాంగ్ ఫెంగ్ ఆర్మీ చేతికి వస్తే దేశ రక్షణ వ్యవస్థ మరింత పటిష్ఠమవుతుందని చైనా ఆర్మీ అంటోంది. ఈ ఖండాంతర క్షిపణిని రష్యా సరిహద్దుల్లో మోహరించినట్లు ఇంటెలిజెన్స్ సమాచారం. దీని వల్ల ఐరోపా, అమెరికాలోని సుదూర లక్ష్యాలను సులభంగా ఛేదించవచ్చని చైనా పాలకులు నమ్ముతున్నారు. డాంగ్ ఫెంగ్ 41 క్షిపణి పరీక్షలు ద్వారా చైనా ఏం చెప్పాలనుకుంటోంది? తమ సత్తా చాటటమే డ్రాగన్ కంట్రీ ఉద్దేశమా? నిజానికి చైనా పెద్ద వ్యూహంతోనే ముందుకు కదులుతోంది. అవలీలగా అణుదాడి చేయగలనని చెప్పడమే చైనా ఉద్దేశం. పొరుగు దేశాలను భయపెట్టి దరికి రాకుండా చూడడమే ధ్యేయం. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దూకుడు చూసిన తర్వాతే చైనా కూడా ఖండాతరం క్షిపణి ప్రాజెక్టును వేగవంతం చేసినట్లు తెలుస్తోంది. కొరియా ద్వీపకల్పంలో యుద్ధం వస్తే చైనాకు ఉపయోగపడే ఆయుధాల్లో ఇదీ ఒకటి. డాంగ్ ఫెంగ్ 41 క్షిపణితో భారత్ కు వచ్చే నష్టమేంటి? చైనాతో పోటీ పడే సమర్థత మనకూ ఉందా? డాంగ్ ఫెంగ్ తో అగ్ని ఫైవ్ ను కొంత మేర పోల్చే అవకాశం ఉంది. అగ్ని సిరీస్లో ఇప్పటి వరకు ఐదు క్షిపణులు వచ్చాయి. అగ్ని వన్ మధ్యదూర లక్ష్యాలను ఛేదించే క్షిపణి 12 వందల కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించే సత్తా దీనికి ఉంది. అగ్ని వన్ విజయవంతమైన తర్వాతే రక్షణ పరిశోధనా అభివృద్ధి సంస్థ ఖండాంతర క్షిపణులను అభివృద్ధి చేసింది. అగ్ని టూ, త్రీ, ఫోర్ తర్వాత ఇప్పుడు అగ్ని ఫైవ్ పై ప్రయోగాలు తుది దశలో ఉన్నాయి.

ఐదు వేల కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించే సత్తా అగ్ని ఫైవ్ కు ఉంది. ఆయితే భారత ప్రభుత్వం నిజాలను దాస్తోందని ఇటీవల చైనీస్ మీడియా ఆరోపించింది. అగ్ని ఫైవ్ తో ఎనిమిది వేల కిలోమీటర్ల లక్ష్యాలను ఛేదించే వీలుందని అంచనా వేసింది. చైనా ఆర్మీ అత్యాధునిక ఖండాంతర క్షిపణులను తయారు చేస్తోందని తెలుసుకున్న డీఆర్డీఓ తన ప్రయోగాలను మరింత వేగవంతం చేసింది. అగ్ని సిక్స్ క్షిపణిపై దృష్టి పెట్టింది. అగ్ని సిక్స్‌కు ఎనిమిది నుంచి పది వేల కిలోమీటర్ల లక్ష్యాలను ఛేదించే సమర్థత ఉంటుందని శాస్త్రవేత్తలు అంటున్నారు. అలా జరిగినా కూడా చైనా వారి డాంగ్ ఫెంగ్ 41తో అది పోటీ పడలేదు. ఇప్పుడు భారత్ ముందు పెద్ద సవాలే ఉంది. డాంగ్ ఫెంగ్ 41 కంటే సమర్థమైన ఖండాంతరం క్షిపణిని రూపొందించగలగాలి. డాంగ్ ఫెంగ్ కంటే వేగంగా లక్ష్యాలను ఛేదించగలదని నిరూపించగలగాలి. అప్పుడే చైనా దూకుడుకు కళ్లెం వేసి అవకాశం ఉంది.

## 'కొలువులకై కొట్లాట'

తెలంగాణ యువత మంచి కోసం చేస్తున్న ఈ ఉద్యమాన్ని ప్రభుత్వం ఉక్కుపాదంతో అణిచివేస్తోందని కోదండరాం అన్నారు. ప్రభుత్వం ఎన్ని ప్రయత్నాలు చేసినా యువతకు మంచి జరిగేంత వరకూ తమ ఉద్యమం ఆగదని స్పష్టం చేశారు. ఈ నెల 31న సభ నిర్వహించేందుకు అనుమతి కోరగా భద్రతా కారణాల మేరకు ప్రభుత్వం సభకు అనుమతి నిరాకరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కోదండరాం హైకోర్టును ఆశ్రయించారు.

## లాభసాటి వ్యవసాయం కోసమే విత్తనోత్పత్తి కేంద్రం

ఉన్నట్లు తెలిపారు. వ్యవసాయానికి సాంకేతిక పరిజ్ఞానం అనుసంధానం చేస్తామని, మట్టిలో తేమను పరీక్షించే టెక్నాలజీ వచ్చిందని తెలిపారు. ఫార్మర్స్ వన్‌స్టాప్ సర్వీస్ సెంటర్ తీసుకొచ్చామన్నారు. వ్యవసాయంలో సుస్థిరత కోసం కోల్డ్‌చైన్ టెక్నాలజీ రావాలన్నారు.

## ఐసీజేలో భారత్ విజయం

నిర్వహించారు. ఈ ఐదుగురితో పాటు పోటీలోకి లెబనాన్‌కు చెందిన జస్టిస్ నవాఫ్ సలామ్ కూడా వచ్చారు. వీరిలో ఫ్రాన్స్, సోమాలియా, లెబనాన్, బ్రెజిల్‌కు చెందిన న్యాయమూర్తులు మెజార్టీతో గెలుపొందారు. మిగిలిన ఒక స్థానంలో భండారి, గ్రీన్‌వుడ్ హోరాహోరీగా తలపడ్డారు.

11 రౌండ్లు పూర్తయినా ఫలితం తేలకపోవడంతో సోమవారం మరో రౌండ్ నిర్వహించాలని భావించారు. అయితే ఎన్నికలకు కొద్ది గంటల ముందు అనూహ్యంగా బ్రిటన్ పోటీ నుంచి తప్పుకుంది. తన నామినేషన్‌ను ఉపసంహరించుకుంటున్నట్లు జస్టిస్ గ్రీన్‌వుడ్ తెలిపారు. దీంతో భండారికి మార్గం సుగమమైంది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి అయిన భండారి 2012 ఏప్రిల్ 27న ఐసీజేకు ఎన్నికయ్యారు.

## ఇస్లామిక్ స్టేట్‌ను ఊడ్చేశాం

నెలలుగా ఐఎస్‌ను ఇరాన్ సైన్యం ఊచకోత కోస్తూ వస్తోంది. అందులో బాగంగానే శనివారం నాటికి దేశసరిహద్దుల నుంచి ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదులను తరిమికొట్టినట్లు ఇరాన్ ఆర్మీ ప్రకటించింది.

## బాబు అబద్ధాల పుట్ట

రెడ్డి అన్నారు. ప్రజాసంకల్పయాత్రలో భాగంగా 14వ రోజు మంగళవారం సాయంత్రం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బేతంచర్ల చేరుకున్నారు. బేతంచర్లలో పెద్దసంఖ్యలో ప్రజలు వైఎస్ జగన్‌కు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి వైఎస్ జగన్ ప్రసంగిస్తూ.. చంద్రబాబు పాలనపై నిప్పులు చెరిగారు.

### వ్యవస్థకు విశ్వసనీయత తీసుకురావాలి

ప్రస్తుత రాజకీయ వ్యవస్థ మారాలి. ఈ వ్యవస్థ మారకపోతే అవహేళనకు గురవుతుంది. పదవుల కోసం అడ్డగోలుగా హామీలు ఇచ్చి.. ప్రజలను ఇలాగే మోసం చేస్తూ ఉంటారు. దీనికి వ్యతిరేకంగా వ్యవస్థలో చైతన్యం రావాలి. చంద్రబాబు లాంటి వ్యక్తులను వదిలేస్తే.. మళ్లీ అధికారం కోసం రేపొద్దున ప్రతి ఇంటికి కేజీ బంగారం, ప్రతి ఇంటికి మారుతి కారు కొనిస్తానని నమ్మబలుకుతాడు. ఇలాంటి వ్యక్తులను, మోసాలను వ్యవస్థ నుంచి తరిమేయాలి. విశ్వసనీయతకు అర్థం తీసుకురావాలి అని పేర్కొన్నారు.

## మెట్రో ట్రైన్ వస్తోందంటే ట్రావెల్స్, క్యాబ్‌లకు గుండెదడ!

హైదరాబాద్ మెట్రో రైలు ప్రయాణం వేగవంతమైనదే కాదు.. అత్యంత సౌకర్యవంతమైనది కూడా. సకుటుంబ సపరివారంతో క్షేమంగా వెళ్లి లాభంగా వచ్చే ప్రయాణం ఇది. ఈ మెట్రోరైల్ స్టేషన్లు సరికొత్త వసతులు, సౌకర్యాలతో అన్ని వర్గాల వారిని అలరించబోతున్నాయి. స్టేషన్‌లో దిగడమే ఆలస్యం కోరుకున్న వస్తువులు అందుబాటులో ఉంటాయి. ఆయా వస్తువుల కొనుగోలు కోసం ట్రాఫిక్ రద్దీలో రోడ్లు దాటాల్సిన అవసరం ఉండదు.

కూరగాయల నుంచి.. ఆటపాటలు కోరుకునే పిల్లల కోసం ప్రత్యేక ఏర్పాట్లు ఆయా మెట్రో స్టేషన్లలో ఉండబోతున్నాయి. మెట్రో స్టేషన్లలో ప్రత్యేకంగా గేమింగ్ జోన్లు, మహిళల కోసం షాపింగ్ సెంటర్స్ తదితర సదుపాయాలతో మెట్రో సేవలు భళా అనిపించబోతున్నాయి. మెట్రోలో ప్రయాణం వల్ల సమయమే కాదు.. డబ్బు కూడా ఆదా అవనుంది.. పైగా ప్రయాణం భద్రం కూడా! ఇన్ని సౌకర్యాలుండబట్టే మెట్రోరైలు ప్రారంభం కోసం నగరవాసులు ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు.

# రహదారుల నిర్మాణానికి రూ.15కోట్లు

## 50 గ్రామాలకు రవాణా సదుపాయం

కొయ్యూరు : మన్యంలో మారుమూల గ్రామాలకు వెళ్లే రహదారులకు మంచి రోజులు కానున్నాయి. మెటల్ రోడ్ల నిర్మాణాలకు రూ.67కోట్లు నిధులు మంజూరు చేయగా కొయ్యూరు మండలంలో 50 గ్రామాల ప్రజలకు రవాణా సదుపాయం కల్పించేందుకు 19 మెటల్ రోడ్ల నిర్మాణానికి రూ.15 కోట్లు మంజూరయ్యాయి. జంగాలతోట నుంచి ఎర్రగొండకు ఏడు కిలో మీటర్ల రహదారికి ఏడు కిలో మీటర్ల రహదారికి రూ.2.1కోట్లు, పలకజీడి నుంచి ఈదులబందకు 5కిలో మీటర్ల మెటల్ రోడ్డు నిర్మాణానికి రూ.1.5కోట్లు, బర్రంపేట నుంచి తూర్పుగోదావరి జిల్లా సరిహద్దు ప్రాంతమైన బర్దనాపల్లికి నాలుగు కిలో మీటర్ల రహదారికి రూ.1.1కోట్లు మంజూరయ్యాయి. ఈదులబంద నుంచి బిల్లలపాలెంకు రూ.1.62 కోట్లు, చోద్యం నుంచి బాలారం మీదుగా డి.మల్లవరం రహదారికి రూ.80లక్షలు, పెదమాకవరం నుంచి కత్తిరాళ్లలద్దికి రూ.69లక్షలు, మర్రిపాలెం నుంచి రెళ్లలపాలెంకు రూ.47లక్షలు, మల్లవరం నుంచి మాడుగుల కన్నంపేట నుంచి ఆర్.కొత్తూరు, బకులూరు నుంచి ఎర్రదిబ్బలు రహదారికి రూ.50లక్షలు చొప్పున, యు.చీడిపాలెం నుంచి ఉల్లిగుంటకు రూ.80లక్షలు, ఎర్రగొండ నుంచి తీగెలమెట్టకు రూ.కోటి, ఆర్.కొత్తూరు నుంచి మల్లవరం రహదారికి రూ.49లక్షలు, గదబపాలెం నుంచి కొత్తూరుకు రూ.24లక్షలు, బర్రంపేట, కొప్పుకొండ రహదారికి రూ.69 లక్షలు, రేవళ్ల, బూరుగుపాలెంకు రూ.70లక్షలు, గొట్టెటపాడు-కంపమామిడికి రూ.43లక్షలు, కొత్తపల్లి తాటిమానిపాలెంకు రూ.48లక్షలు నిధులు మంజూరయ్యాయి.

## ఉత్తమ పంచాయతీలుగా జేపి.అగ్రహారం, గుండుబాడు ఎంపిక

రోలుగుంట : మండలంలో గుండుబాడు, జేపి.అగ్రహారం పంచాయతీలు ఉత్తమ పంచాయతీలుగా ఎంపికైనట్లు ఈవోపిఆర్‌డి ఎస్.రామ్మోహన్‌రావు తెలిపారు. ఈ పంచాయతీల్లో 2015–16లో రోడ్లు, డ్రైన్లు, మరుగుదొడ్లు తదితర మౌలిక సదుపాయాలు శతశాతం కల్పించారు. కృషి పంచాయతీ అభివృద్ధికి కృషి చేసిన వారిని ఈవోపిఆర్‌డి ఎస్.రామ్మోహనరావు అభినందించారు.

చిరు వ్యాపారులకు ...

# ఆంధ్రాబ్యాంకు ద్వారా ఈ-వ్యాపారం



పెందుర్తి : నగదు రహిత లావాదేవిలు శరవేగంగా అభివృద్ధి చేసేందుకు ఆంధ్రబ్యాంకు ఇతర బ్యాంకులతో గట్టి గానే పోటీ పడుతుందనే చెప్పాలి. ఇప్పటి వరకు నగదు రహిత లావాదేవిలు జరప డానికి స్వైపింగ్ మిషన్లు వినియోగం లోకి వచ్చాయి. డేబిట్, క్రెడిట్ కార్డులు ఉన్నా వాళ్లంతా షాపులకు వెళ్లి ఏ వస్తువులు కొనుగోలు చేసిన తరువాత తమ కార్డులు స్వైపింగ్ చేసి నగదు రహిత లావాదేవిలు జరిపేవారు. ఇప్పుడు ఈ కార్డులు ద్వారా ఒకరు కార్డు మరోక్కరు ఉపయోగించే వీలు ఉంది. ఇప్పుడు ఈ వ్యాపారం ద్వారా ఆంధ్ర బ్యాంకు అన్ని రకాల వ్యాపారులు నగదు రహిత వ్యాపారాలు నిర్వహించడానికి డివైజ్‌ను వ్యాపారులకు అందిస్తున్నారు. ఈ వ్యాపారస్తులు దగ్గర హైండ్రెడ్ ఫోను చేతిలో ఉంటే చాలు. కోను గోలు దారు నుంచి వేలి ముద్ర సేకరించి... విని యోగదారునికి ఏ బ్యాంకు అకౌంటు ఆధార్‌తో అనుసంధానం అయి ఉంటే ... ఆ అకౌంటు ద్వారా వ్యాపారుల అకౌంటులోకి వినియోగ దారుడు కోనుగోలు చేసిన వస్తువున కు నగదు చేరుతుంది. ఇటు వ్యాపారులకు ... ఆటు వినియోగదారునికి ఉపయోగపడే ఈ వ్యాపారం ద్వార డివైజ్‌ను ఆంధ్ర బ్యాంకు కేవలం 3000 రూపాయలకే అందిస్తూన్నామని విశాఖ పట్నం జిల్లా పెందుర్తి ఆంధ్ర బ్యాంకు మేనేజరు జి. అప్పారావు మిడియాకు తెలియజేసారు. ఆయన మంగళవారం పెందుర్తి ఉన్నా చిరు వ్యాపారులకు ఈ డివైజ్‌ను అందజేసి, ఈ వ్యాపారం వలన లాభాలు, దిని ఉపయోగాలు షాపు షాపునకు వెళ్లి వ్యాపారులకు వివరించారు. ఈ డివైజ్‌ను వ్యాపారులు ఉప యోగించడం ద్వారా వ్యాపారులు బ్యాంకునకు ఎటువంటి చార్జీలు చెల్లించవలసిన అవసరం లేదన్నారు. ఏన్ని సంవత్సరాలు వ్యాపార లావాదేవిలు సాగించి న బ్యాంకు వ్యాపారుల కోరకు ఉచిత సేవాలు అంది స్తూందని ఆంధ్ర బ్యాంకు మేనేజరు జి. అప్పారావు తెలియజేసారు. వ్యాపారులు తమ బ్యాంకును సంప్రదిస్తే తక్షణమే వారికి డివైజ్ అందజేసి, ఈ వ్యాపారం ద్వారా వ్యాపారులు సులభంగా తమ వ్యాపార లావేదేవిలు సాగించవచ్చాని వివరించారు.

డిసెంబర్ 3న భువనేశ్వరి అమ్మవారికి

# దేవకాంచన పత్రితో అధివాసం



విశాఖపట్నం : సబ్బవరం మండలం, యాతపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో వెలసియున్న భువనేశ్వరి దేవి అమ్మవారికి డిసెంబర్ 3వ తేదీన 86వ ఆదివాస మహోత్సవాన్ని దేవకాంచన పత్రితో నిర్వహించనున్నట్లు శ్రీ భువనేశ్వరీ దేవీ సంస్థాన్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు ఓంకార రుషి తెలిపారు. డిసెంబర్ 3వ తేదీ విశాఖ నక్షత్ర శుభపుష్కార్య యోగం, శుభలగ్నమున, అభిజిత్ లగ్నమున అమ్మవారి దివ్య శిలావిగ్రహానికి దేవ కాంచన పత్రితో యథాతథంగా మంగళస్నానాలు తదితర కార్యక్రమాలకు దివ్యాలంకరణ, అర్చనాది కార్యక్రమాలతో పాటు దేవకాంచన పత్రితో ఆదివాస మహోత్సవంను నిర్వహిస్తామని తెలిపారు. అమ్మవారికి సేవ చేస్తే అన్ని ఫలితాలు, సుఖాలు పొందవచ్చన్నారు. ఇది 86వ ఆదివాసమని పేర్కొన్నారు. భక్తులు కార్తీక మాసంలో అమ్మవారికి దేవకాంచన పత్రితో పూజలు చేస్తే సర్వ కోరికలు తీరుతాయి.

భక్తులు పంచామృతాలు, చీర, కుంకుమ తెచ్చుకొని అమ్మవారికి సమర్పించి అమ్మ కృపకు పాత్రులు కాగలరని ఓంకార రుషి వివరించారు.

# ప్రజా సంకల్పయాత్రతో తెదేపాకు చరమగీతం




గాజువాక: అమలు కాని హామీలనిచ్చి గద్దెనెక్కిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు రాష్ట్ర ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని, ప్రజా సంకల్ప యాత్రతో తెదేపాకు చరమ గీతమని రాష్ట్ర బి.సి సెల్ వైసిపి ప్రధాన కార్యదర్శి ఎన్నేటి రమణ మండిపడ్డారు. మంళవారం నియోజవర్గం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ తెదేపా పాలనపై బడుగు బలహీన వర్గాల ప్రజలు వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర వైకాపా అధ్యక్షులు, ప్రతిపక్షనేత వైయస్ జగన్ ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు చేపట్టిన ప్రజా సంకల్పయాత్రను చూసి ఓర్వలేక తెదేపా భగ్నం చేసేందుకు అనేక కుట్రలకు పాల్పడుతుందని ధ్వజమెత్తారు. పోలీసులతో అడ్డుకట్టవేసేందుకు తెదేపా ప్రయత్నించడం దారుణమని అన్నారు. రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతుందని మండి పడ్డారు. ప్రజాసంకల్ప యాత్రకు మహిళలనుంచి మంచి స్పందన వస్తుందని అన్నారు. ప్రజా సంకల్పయాత్రతో తెదేపాకు చరమగీతమని అన్నారు. తెలుగు తమ్ములు చేస్తున్న కుట్రలు, కుయుక్తులు ప్రజలు నమ్మే పరిస్థితి లేదని అన్నారు. రానున్నది వైయస్ఆర్ కాలమని రాష్ట్రంలో వైయస్ఆర్ అధికారం చేపట్టడం ఖాయమని, అప్పుడే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు మర్డపూడి పరదేశి, అండిబోయిన అప్పారావు, జి.రోజారాణి, గాలి నూకరాజు, చందు, సారిపల్లి గణపతి తదితరులు పాల్గొన్నారు.

# భారత్‌పై నిందలు మానండి

## పాక్‌కు చైనా ఝలక్



బీజింగ్ : అంతర్జాతీయంగా జరిగే ప్రతి వ్యవహారం లోనూ భారత్‌పై నిందలు వేసే బుద్ధిని మానుకోవాలని పాకిస్తాన్‌కు చైనా స్పష్టం చేసింది. ముఖ్యంగా 500 మిలియన్ డాలర్లతో నిర్మిస్తున్న చైనా-పాకిస్తాన్ ఎకనమిక్ కారిడార్‌పై భారత్ గూఢచర్యం చేస్తోందన్న పాకిస్తాన్ వ్యాఖ్యలను చైనా కొట్టిపారేసింది. సీపీఈసీ ప్రాజెక్టును గందరగోళ పరిచేలా వివాదాస్పద ప్రాంతాల్లో భారత్ అరాచకత్వాన్ని పెంపొందిస్తోందని పాకిస్తాన్ జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ కమిటీ ఛైర్మన్ జనరల్ జుబిర్ మహమ్మద్ హయత్ నవంబర్ 14న ప్రకటించారు. భారత నిఘా సంస్థ అయిన రీసెర్చ్ అండ్ ఎనాలసిస్ వింగ్(రా) ఇందుకోసం ప్రత్యేకంగా 500 మిలియన్లతో ఒక జట్టును తయారు చేసిందని ఆయన పేర్కొన్నారు. బలూచిస్తాన్ ప్రావిన్స్‌లో ఉగ్రవాదాన్ని భారత్ పెంపొందిస్తోందని ఆయన ఆరోపించారు.

సీపీఈసీ ప్రాజెక్టు గురించి భారత్‌పై పాకిస్తాన్ చేసిన ఆరోపణలను చైనా తీవ్రంగా ఖండించింది. ఇటువంటి వ్యాఖ్యలు చేయడం ఎవరికీ మంచిదికాదని చైనా స్పష్టం చేసింది.

# నారపాడు పంచాయితీలో పొలం పిలుస్తుంది



సబ్బవరం: మండలంలోని నారపాడు పంచాయితీలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి మండల వ్యవసాయ అధికారి టి.దుర్గా ప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ రబిలో వేసుకోవలసిన విత్తనాలు మినుములు, పెసర, వేరుశెనగ అందుబాటులో వున్నా యని అన్నారు.

వరి పంటలు కోతలు సమయంలో తుఫాన్ హెచ్చరికలు దృష్టిలో ఉంచుకొని పంటకోతలు కొయ్యాలని రైతును కోరారు. పంట నమోదు సి.క్రాప్ ప్రతి రైతు చేసికోవాలన్నారు.

వ్యవసాయ యాంత్రీకరణలో ఆయిల్ ఇంజన్స్ అందుబాటులో వున్నాయన్నారు. రైతులందరూ సద్విని యోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఇఓ కృష్ణవేణి, ఎన్.సి హెచ్.కిశోర్‌కుమార్, పి.హేమలత, స్వప్న, రైతులు, కొరుప్రోలు గోవిందు, ముక్కా సన్యాసి తదితరులు పాల్గొన్నారు.

# బయోమెట్రిక్ అయితే మాకేం భయం




సింహాచలం : బయోమెట్రిక్ విధానం అమల్లో మూడు అడుగులు ముందుకు... రెండు అడుగులు వెనక్కి అన్న చందంగా తయారైంది సింహాచలం దేవస్థానం పరిస్థితి. ఈ విధానాన్ని అమలు చేసేందుకు అష్ట కష్టాలు పడుతున్నారు. అయితే బయోమెట్రిక్ విధానాన్ని ప్రవేశపెట్టి మూడు నెలలు కావస్తున్నా. ఫలితం మాత్రం కని పించడం లేదు. బయోమెట్రిక్ యంత్రాలు నేరుగా ముఖ్యమంత్రి పేషీ, జిల్లా కలెక్టర్ కార్యాలయంకు అనుసందానం ఉన్న ఎవరు భయపడటం లేదు. ఒకవేళ ఏమైనా కలెక్టర్ కార్యాలయం నుండి బయోమెట్రిక్ హాజరుపై ప్రశ్నిస్తే యంత్రాలు మొరాయిస్తున్నాయని అందుకే పాత పద్ధతిలో వేతనాలు చెల్లించటం జరపాల్సి వస్తుందని అధికారులు సమాధానం ఇస్తారు. సంస్థలో కొంతమంది ఉన్నతాధికారుల అండ దండలతో ఏకంగా ఒకటి కాదు రెండుకాదు ఏకంగా 7 నుండి 10రోజలు విధులకు హాజరుకాకుండా పాత పద్దతిలో నెల అయ్యేసరికి మెన్యూల్ హాజరు పట్టి ద్వారా వేతనాలు అందించటం జరుగుతోంది. ఈ విషయంపై కార్యనిర్వాహణాధికారి వారికీ ఫిర్యాదు చేయటం జరిగిందని కొంతమంది ఉద్యోగులు అంటున్నారు. పూర్తిస్థాయిలో అమలు కావడం లేదు. కొన్ని బయోమెట్రిక్ మిషన్లు మొరాయిస్తుంటే... వాటి స్థానంలో ఆధార్ అనుసంధానము చేసే 4 యంత్రాలను ఒక్కొకటి రూ.11 నుండి 14వేలు ఖరీదు చేసే యంత్రాలను కొనుగోలు చేయటం జరిగింది. వివిధ సమస్యలు సృష్టిస్తూ హాజరు తీసుకోవడంలో నిర్లక్ష్యంప్రదర్శిస్తున్నారు.

సర్వేనెంబర్ 417/9లో

# అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోండి : కోరాడ మహేష్

అనకాపల్లి : సత్యనారాయణపురం పంచాయితీ మూలపేటలో గోవర్ధన గిరిపై ఊరవ కొండను ఆక్రమించి ఇల్లు నిర్మిస్తున్న వారిని నిలదీస్తే తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని సత్యనారాయణ పురం సర్పంచ్ కోరాడ నూకరత్నం భర్త కొరాడ మహేష్ ఆవేదన వ్యక్తం చేశారు. తన సొంత నిధులతో గోవర్ధగిరిపై కృష్ణుడు, వెంకటేశ్వరస్వామి విగ్రహాలను ఏర్పాటు చేశామని తెలిపారు. అయితే కొండ మీదకు వెళ్లే దారిని అక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. ఇదే విషయంపై ఆక్రమ నిర్మాణలు చేపడుతున్న వారిని అడిగితే తనకు ఎల్‌పిసిల కోసం డబ్బులు ఇచ్చినట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తప్పు చేసి డబ్బులు వసూలు చేయాల్సిన అవసరం తనకు లేదని కావాలనే ప్రతిపక్షపార్టీలకు చెందిన వారు తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. తక్షణమే రెవెన్యూ అధికార్లు స్పందించి సర్వే నెంబర్ 417/9లో ప్రభుత్వ స్థలాలను అక్రమించి ఇల్లు నిర్మించుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని మహేష్ కోరారు.

# ప్రజల అవగాహన లోపం - ఎస్‌బిఐ వీధికి చెత్త శాపం

-పొంచి వున్న వ్యాధుల ప్రభావం



అరకులోయ: పారిశుధ్యంపై ప్రజల్లో ఉన్న అవగాహన లోపం స్టేట్‌బ్యాంకు వీధికి వాపంగా పరిణమిస్తుంది. ఒక పక్క ప్రభుత్వం పారిశుధ్య దినోత్సవాలు నిర్వహిస్తూ... అపారిశుధ్యం వలన కలిగే నష్టాలను ప్రజలకు వివరిస్తున్న ప్రజలు మాత్రం చైతన్యవంతులు కావడం లేదు. ఎవరి ఇళ్లల్లో వారు చెత్త బుట్టలు పెట్టుకొని పంచాయితీ చెత్త బళ్లు వీధులకు వచ్చినప్పుడు చెత్త పారవేయాలని అధికారులు ఎప్పటికప్పుడు చెబుతున్నా ప్రజల్లో చైతన్యం కలగడం లేదు. వందల మంది ప్రతీరోజూ తిరిగే ఎస్‌బిఐ, ఎపిజివిబి బ్యాంకు రహదారిలో గ్రామీణ బ్యాంకు ఎదురుగా ప్రజలు చెత్త పారవేస్తుండటంతో బ్యాంకులకు పిల్లా, పాపలతో కుటుంబాలతో వచ్చే వివిధ గ్రామాల గిరి జనులు, స్థానిక ఖాతాదారులు అగచాట్లు పడుతున్నారు. ముక్కు మూసుకుని బ్యాంకు ముందు ఉంటున్నారు. బ్యాంకు పనులు అంత త్వరగా జరిగేవి కాకపోవడంతో చెత్తా, చెదారం మధ్యనే నిరీక్షిస్తూన్నారు. బ్యాంకు ఎదురుగా రెండు చోట్ల వారం రోజులుగా చెత్త పేరుకుపోతున్న పట్టించుకునే నాధుడే లేడా అంటూ బ్యాంకులకు వచ్చే ఖాతాదారులు వాపోతున్నారు. కుప్పలు, తెప్పలుగా పేరుకుపోతున్నా చెత్తవలన వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని బ్యాంకులకు పనులపై వచ్చే లబ్ధిదారులు భయాందోళనలు చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్టేట్ బ్యాంకు వీధిలో పేరకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించాలని ఖాతాదారులు విజ్ఞప్తి చేస్తున్నారు. అదేవిధంగా పారిశుధ్యంపై, అపారిశుధ్యంపై కలిగే నష్టాలపై వీధి ప్రజలకు అవగాహన కల్పించాలని, ఎవరి ఇంట్లో చెత్తను ఆ ఇంటివారే చెత్త బుట్టలలో వేసుకునే విధంగా చర్యలు చేపట్టాలని అరకులోయ మండల ప్రజలు అధికారులను కోరుతున్నారు. ప్రజలకు అవగాహన కల్పించకపోతే వీధి.. వీధి చెత్తమయం అవుతుందని స్థానికుల ఆందోళన చెందుతున్నారు.

# అంబులెన్స్‌లు ప్రారంభం




విశాఖపట్నం: విశాఖ వైద్య విజ్ఞాన సంస్థ, విశాఖకు రెండు అంబులెన్స్‌లను పార్లమెంట్ సభ్యులు కంభంపాటి హరిబాబు పార్లమెంటఁ నియోజకవర్గ అభివృద్ధి నిధులతో సమకూర్చారు. ఈ అంబులెన్స్‌లు నిమిత్తం రూ.31, 92,328/- పార్లమెంటఁ వర్గ అభివృద్ధి నిధులు సమకూర్చారు. వాటితో పాటు విన్గర్ బిఎస్-4 మోడల్ అంబులెన్స్‌లు కొనుగోలు చేసి రోగుల సౌకర్యార్థం ఏర్పాటు చేశారు. ఈ అంబులెన్స్‌లో పార్లమెంట్ సభ్యులు కంభంపాటి హరిబాబు మంగళవారం ప్రారంభించారు. తదుపరి ఆసుపత్రి నందు వివిధ విభాగాల యందు పర్యటించి ఆసుపత్రిలో జరుగుచున్న అభివృద్ధి కార్యక్రమాలను తెలుసుకున్నారు.

ఆసుపత్రి నందలి వివిధ వార్డులు, ఓపి విభాగం, అత్యవసర విభాగం, శస్త్ర చికిత్స విభాగం, తదితర విభాగములు పర్యటించి ఆసుపత్రి సిబ్బంది నుద్దేశించి ప్రసంగించినారు.

ఈ కార్యక్రమం నందు ఆసుపత్రి డైరక్టర్ డా.కె.సత్యవరప్రసాద్, ఆర్ఎంఓ డా.బిఎస్.చక్రవర్తి, డా.జి.రామ కృష్ణ, హేమలత తదితరులు పాల్గొన్నారు.

# మంచినీటి సమస్య తీరింది



అచ్యుతాపురం: చోడపల్లి గ్రామంలో ప్రజలు ఎదుర్కోంటున్నా మంచినీటి సమస్య తీరింది. మంగళవారం సర్పంచ్ ఈగల అప్పలనాయుడు గ్రామంలో ఏర్పాటు చేసిన వీధికొళాయిలను ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో కార్యదర్శి సత్యనారాయణ వార్డుమెంబర్ వి. చిరంజీవి, మహాలక్ష్మినాయుడు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# బాలల హక్కులను పరిరక్షించాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న లేబర్ ఆఫీసర్ నానాజీరావు

నర్సీపట్నం : బాలలపై జరిగే లైంగిక వేధింపులు, దోపిడిలపై ఫిర్యాదు చేయడానికి జాతీయ బాలల హక్కుల కమీషన్ వెబ్‌సైట్ రూపొందించడం జరిగిందని నర్సీపట్నం డివిజన్ లేబర్ ఆఫీసర్ నానాజీరావు పేర్కొన్నారు. జాతీయ బాలల హక్కుల పరిరక్షణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం నాడు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రొటక్షన్ చైల్డ్ గ్రూపు, విశాఖ ఫోరం చైల్డ్‌రైట్స్, చైల్డ్‌రైట్స్ అక్వొకసీ పౌండేషన్(కాఫీ) ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల హక్కులను పరిరక్షించవలసిన అవసరం ఉందన్నారు. బాలల హక్కుల కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాయన్నారు. హక్కులను కాపాడుకోవడానికి జాతీయ కమీషన్ పోక్సో ఇబాక్స్ అనే వెబ్‌సైట్ రూపొందించిందన్నారు. ఈ వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటారన్నారు. నర్సీపట్నం డివిజన్ క్రాఫ్ ప్రతినిధి పికెఎం.హెల్డెన్ మాట్లాడుతూ బాలల కోసం ఎన్ని రకాల చట్టాలు వచ్చినా అవి కాగితాలకే పరిమితం అవుతున్నాయన్నారు. పాఠశాలల్లో రోడ్ల మీద గృహాల్లో, బస్సుల్లో ఇప్పటికే బాలికలపై హింస జరుగుతూనే ఉందన్నారు. వీటిని అరికట్టడం కోసం కేంద్రం పాక్సోఇబాక్స్ అనే వెబ్‌సైట్ రూపొందించిందన్నారు. అందరూ బాలలు హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# విజయభాను సంపాదకీయం

## పద్మావతి వివాదం

కళా, సాహితీ సృజన విషయంలోనైనా జబ్బ బలం చూపి శాసించే పోకడ మంచిది కాదు. విజ్ఞతతో కూడిన చర్చను ప్రోత్సహించాలె కానీ, భావ వ్యక్తీకరణను అడ్డుకోవడం ప్రజాస్వామ్య వ్యవస్థలో ఆమోదనీయం కాదు. దేశంలో చట్టబద్ధ పాలన ఉండాలె తప్ప, బడితె ఉన్నవాడిదే బర్రె అన్నట్టుగా సాగితే మరి ఇన్ని ప్రజాస్వామిక వ్యవస్థలు ఉన్నది ఎందుకు? తాము కోరుకున్నట్టే రాయాలని, తమకు నచ్చినట్టే సినిమా తీయాలని, తాము చెప్పిన పదార్థాలే తినాలని, తాము కోరుకున్నట్టే దుస్తులు వేసుకోవాలని ఎవరికి వారు ఆదేశాలు జారీ చేస్తూ, దోష నిర్ధారణ చేసి, శిక్షలు విధించుకుంటూ పోతే చట్టబద్ధ పాలన ఎక్కడున్నట్టు? ఏదైనా కళాఖండాన్ని సృష్టించినప్పుడు, విమర్శకులు భిన్న వాదనలు వినిపిస్తారు. వ్యాపార రంగమైతే, ఆ కోణంలో చర్చ సాగుతుంది. కానీ పద్మావతి సినిమా అందుకు భిన్నమైన కారణాల వల్ల వివాదాస్పదమైంది. దేశ రాజకీయ రంగాన్ని భావజాలపరంగా రెండుగా విడదీసింది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ శిబిరం నుంచి సినిమాకు వ్యతిరేక స్వరాలు వినిపిస్తున్నాయి. ప్రతిపక్షాల నుంచి ఇందుకు భిన్నవాదనలు వినబడుతున్నాయి. కొన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా ఈ వివాదంలో తమ స్వరం వినిపిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకుడు అయినప్పటికీ, పంజాబ్ ముఖ్యమంత్రి (పాటియాలా మహారాజు కుమారుడు) అమరీందర్ సింగ్ సినిమాలో వక్రీకరణలు ఉన్నాయంటూ ఆక్షేపించారు. ఈ వివాదం సృష్టించడం వెనుక భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను హరించే పన్నాగం ఉందని తృణమూల్ కాంగ్రెస్ నాయకురాలు, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆరోపిస్తున్నారు. కళా విమర్శకులే కాకుండా, రాజకీయ నాయకులూ ఆరోగ్యవంతమైన చర్చలో భాగస్వాములు కావచ్చు. కానీ చట్టాన్ని అమలు పరుచవలసిన వారు తమ బాధ్యతను విస్మరించకూడదు. ఆందోళనకారులు దర్శకుడిపై భౌతిక దాడికి పాల్పడుతామనీ, కథానాయకి ముక్కు కోస్తామని హెచ్చరించడం కూడా తీవ్ర అభ్యంతరకరం. పద్మావతి సినిమాను విమర్శిస్తున్నవారు చరిత్రను వక్రీకరించకూడదని అంటున్నారు. కానీ ఇందులో చారిత్రకాంశాన్ని తేల్చడం కష్టం. ప్రముఖ సూఫీ కవి మాలిక్ మహమ్మద్ జయాసీ (1540) రాసిన పద్మావత్ కాల్పనిక గాథ పద్మావతిపై వచ్చిన వచ్చిన రచనల్లో మొదటిది. ఆ తరువాత పద్మావతి పాత్రతో పలు రచనలు వచ్చినయి. తరువాతి కాలంలో చరిత్ర రచనల్లో చారిత్రక పాత్రగా కనిపించింది. అయితే వీటి కథనాలూ భిన్న రీతుల్లో ఉన్నాయి. 1303లో చిత్తోడ్ ముట్టడి సందర్భంగా ఖిల్జీ వెంట వెళ్ళిన అమీర్ ఖుస్రో రచనలో పద్మావతి ప్రస్తావన లేదు. అప్పటి రచనల్లో రాణి పద్మిని కోసం కాకుండా వరుస వెంబడి కోటలను జయించడంలో భాగంగానే ఖిల్జీ చిత్తోడ్‌పై దాడి చేసినట్టుగా ఉన్నది. ఆధునిక చరిత్రకారులు ఈ పాత్ర చారిత్రకమైనదని ధ్రువీకరించడం లేదనే అభిప్రాయం ఉన్నది. అయినప్పటికీ జయాసీ రచన తరువాత అనేక రచనలు రావడం మూలంగా సగటు భారతీయుల మస్తిష్కంలో అభిమానవతిగా రాణి పద్మిని స్థిరపడిపోయింది. ఈ కథనం రాజపుత్రుల పౌరుషానికి ప్రతీకగా నిలిచింది. స్వాతంత్ర్యోద్యమ కాలంలో రాణి పద్మినిపై వచ్చిన సాహిత్యం దేశాభిమానాన్ని పెంచింది. రాణి పద్మిని స్వాభిమానానికి చిహ్నంగా నిలిచిపోయింది. చారిత్రకాంశంపై సాహిత్యం సృజించినా, చిత్రం రూపొందించినా కొంత కాల్పనికతను జోడించడం సాధారణం. ఏ సొబగులు లేకపోతే డాక్యుమెంటరీ మాదిరిగా ఉంటుంది. కానీ ఎంత కాల్పనికత జోడించినా ఖిల్జీ (కలలోనైనా) రాణి పద్మావతితో కలిసి ఉన్న దృశ్యాలు కనుక ఉంటే వాటిని దేశ ప్రజలు ప్రత్యేకించి రాజపుత్రులు జీర్ణించుకోలేరు. ఇటువంటి దృశ్యాలు ఏవీ లేవని సినిమా దర్శకుడు అంటున్నాడు. రాణి పద్మినిపై భిన్న కథనాలు ఉన్నందువల్ల సినిమా ఏ రూపం తీసుకున్నదో తెలువదు. వందల కోట్ల రూపాయలు వెచ్చించి సినిమా తీసే ముందు ఈ సున్నితమైన అంశాన్ని పట్టించుకోకుండా ఉంటారా? కానీ చిత్రీకరణ పూర్తి కాకముందే, నిర్మాణ దశలోనే దర్శకుడిపై, సెట్టింగ్‌లపై దాడి జరిగింది. ఆందోళనకారులు అపోహల మూలంగా బెదిరింపులు చేస్తున్నారా? ఆందోళనకారులకు సినిమా ముందుగా చూపిస్తామని దర్శకుడు అంటున్నాడు కనుక, ఇప్పటికైనా వివాదం పరిష్కారమవుతుందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కళా, సాహితీ సృజన విషయంలోనైనా జబ్బ బలం చూపి శాసించే పోకడ మంచిది కాదు. విజ్ఞతతో కూడిన చర్చను ప్రోత్సహించాలె కానీ, భావ వ్యక్తీకరణను అడ్డుకోవడం ప్రజాస్వామ్య వ్యవస్థలో ఆమోదనీయం కాదు.

# విష ప్రభావం చూపుతున్న పాలకుల విధానాలపై గర్జించిన యువత

## చోడవరంలో విద్యార్థి-యువజన సదస్సు





చోడవరంః యువతపై విష ప్రభావం చూపుతున్న అధికార పక్ష పాలకుల విధానాలను నిరశిస్తూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ (పి.డి.ఎస్.ఒ.) ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో భారీ ర్యాలీ, ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద మానవహారం ఏర్పడ్డారు. అనంతరం ఓ ప్రైవేటు కళ్యాణ మండపంలో నిర్వహించిన విద్యార్థి-యువజన సదస్సులో పి.డి.ఎస్.ఒ. అధ్యక్షుడు కె.సతీష్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో యువత చదువు'కొన'లేక, చేతి వృత్తులు, వ్యవసాయం గిట్టుబాటు కాకపోవడంతో పొట్ట చేతబట్టుకుని వలసలు పోతున్నారన్నారు. బాబు వస్తే జాబు వస్తుందంటూ గద్దెనెక్కిన సిం.ఎం. చంద్రబాబు ప్రభుత్వం విధానాలు ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరిస్తూ కాంటాక్టు, ఔట్ సోర్సింగ్, విధానలు ముర్మరం చేస్తున్నాయన్నారు. నిరుద్యోగులకు, ఉపాధి భృతిని ఇస్తామన్న సి.ఎం. తన కొడుక్కి మాత్రమే ఉపాధి చూపి మంత్రిని చేసారని ఎద్దేవా చేసారు. కేజీ నుండి పీజి వరకు ఉచిత విద్యను అందిస్తామన్న పాలకులు నేడు రాష్ట్రంలో వేలాది ప్రభుత్వ పాఠశాలలను ఎందుకు మూసేస్తున్నారని ప్రశ్నించారు. నైపుణ్యాల కొరత అనే సాకుతో నీతి అయోగ్ వ్యూహంలో భాగంగా కార్పోరేట్ కంపెనీలకు కావలసిన నైపుణ్యాల కోసం స్కూలు స్థాయి నుండి వర్సిటీ స్థాయి వరకు విద్యా వ్యవస్థను నాశనం చేస్తున్నారన్నారు. నేటి సినిమా, టీ.వి, ఇంటర్ నెట్‌లు బూతు, రోత, వెకిలితనాలకు కేంద్రాలు మారాయని తెలిపారు. దేశ ప్రజల శ్రమతో యువత శక్తి, సామర్థ్యాలతో ప్రోగవుతున్న జాతీయ సంపదలోని ప్రతీ రూపాయిలో 80 శాతాన్ని పాలకుల అండదండలతో కార్పోరేట్ కంపెనీలు దిగమింగుతున్నాయన్నారు. ప్రజాస్వామిక విలువలను, ప్రశ్నించే తత్వాన్ని అలవరచుకొని భగత్‌సింగ్, అల్లూరి ఆశయాల స్ఫూర్తితో ముందుకు సాగాలంటూ విద్యార్థి, యువజన నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టి. అర్జున్, ఎస్. నూకాచారి, ఓ.వి.వి.ఎస్.లక్ష్మీకుమారి, కె.మోహన్, ఎ.సురేషు తదితరులు పాల్గొన్నారు.



# ఎట్టకేలకు ఉగ్రదేశాల సరసన ఉత్తర కొరియా





వాషింగ్టన్ : ఉత్తర కొరియాపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. ఉగ్రవాదులను పోషిస్తున్న దేశంగా నార్త్ కొరియాను ప్రకటించారు. ఈ పని ఎప్పుడో చేయాల్సి ఉందన్న అభిప్రాయం ఆయన చేశారు. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో ఉ.కొ. పై మరిన్ని ఆంక్షలు (ఇప్పటికే ఉన్నవి కాకుండా...) విధించే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ మేరకు ట్రంప్ వ్యాఖ్యలను ఊటంకిస్తూ... అమెరికా విదేశాంగ మంత్రి రెక్స్ టిల్లర్‌సన్ ఓ ప్రకటనలో వెలువరించారు. ఇరాన్, సూడాన్, సిరియా దేశాల సరసన నార్త్ కొరియాను కూడా చేర్చారు. అణు క్షిపణుల పరీక్షలతో ప్రపంచాన్ని భయభ్రాంతులకు గురి చేసేందుకు ప్రయత్నిస్తున్న నార్త్ కొరియా ఉగ్రవాదానికి మద్దతు తెలుపుతోందని, ఇతర దేశాలను నాశనం చేయాలని చూస్తోందని ట్రంప్ ఆరోపిం చారు. నార్త్ కొరియా చట్టబద్ధంగా నడుచు కోవాలని, అణ్వస్త్ర పరీక్ష లకు స్వస్తి చెప్పాలని, అంతర్జాతీయంగా ఉగ్రవాదులకు మద్దతు ఇచ్చే చర్యలను మానుకోవాలని ట్రంప్ హెచ్చరించారు. కాగా, తన సోదరుడి(నామ్) హత్య వెనక కిమ్ జోంగ్ ఉన్ హస్తం ఉన్నట్టు అమెరికా ఆరోపిస్తోంది. ఇక ఐక్య రాజ్య సమితి సహా ప్రపంచదేశాలు చెబుతున్నా వినకుండా కిమ్ జోంగ్ ఉన్ వారానికో క్షిపణి పరీక్ష నిర్వహిస్తూ ఉద్రిక్తతలను పెంచుతూ వస్తున్నాడు. ఈ క్రమంలో ట్రంప్-కిమ్ మధ్య మాటల యుద్ధం కూడా హద్దులు దాటింది. మరిప్పుడు ట్రంప్ తాజా నిర్ణయం నేపథ్యంలో పరిస్థితులు ఇంకెలా మారబోతున్నాయోనని విశ్లేషకులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

## సూర్యుడిపై శోధనకు ఆదిత్య-ఎల్1

దిల్లీ: సూర్యుడిపై పరిశోధనల నిమిత్తం తొలిసారిగా ఆదిత్య-ఎల్ 1 ఉపగ్రహాన్ని 2019లో ఇస్రో ప్రయోగించనుంది. ఇక, శుక్రుడిపైకి ...అంగారకుడిపై రెండోదఫా పరిశోధనలకు... సంబంధించిన ఉపగ్రహాల ప్రయోగ వివరాలు ఇంకా అధ్యయనం దశలో ఉన్నాయి. ఇస్రో సారథి కిరణ్‌కుమార్ సోమవారం నాడిక్కడ విలేకరులతో మాట్లాడుతూ ఈ విషయాన్ని వెల్లడించారు.

అంతరిక్షంలో ఇప్పుడు భారత్‌కు కేవలం 42 ఉపగ్రహాలు మాత్రమే ఉన్నాయి. అందుకే, ఏటా వాటి సంఖ్యను పెంచేందుకు ఇస్రో యత్నిస్తూనే ఉందని కిరణ్‌కుమార్ చెప్పారు. పెరుగుతున్న భారత అవసరాల మేరకు వీటిని పెంచాల్సి ఉందన్నారు. ఏటా మూడు జీఎస్ఎల్‌వీలు, 8-10 పోలార్ ఉపగ్రహ వాహకనౌకలను ప్రయోగించాలనుకుంటున్నట్లు చెప్పారు. ఇందుకోసం అనుమతుల సాధనకు యత్నిస్తున్నట్లు చెప్పారు. అంటే..,రానున్న అయిదేళ్లలో సుమారు 60 ఉపగ్రహ వాహక నౌకలను ప్రయోగిస్తామన్నారు.

## అగ్నిప్రమాదం అంటూ కలకలం రేపిన పక్షిప్రేమి

బెంగళూరు : నగరంలో కబ్బన్ ఉద్యాన వనంలోని ఒక భారీ చెట్టు కొమ్మపై వచ్చి వాలిన ఓ గద్ద అక్కడున్న దారానికి చిక్కుకుంది. కాలు దారంలో చిక్కి అది తలకిందులుగా వేలాడటాన్ని గుర్తించిన స్థానికుల్లో ఒకరు అగ్నిమాపకదళ సిబ్బందికి ఫోన్ చేశాడు. పక్షిని రక్షించాలి అంటే నిర్లక్ష్యం వహిస్తారనే అనేమానంతో ప్రెస్‌క్లబ్, ఉన్నత న్యాయస్థానం మధ్య ఉన్న పార్కింగ్ ఏరియాలో అగ్నిప్రమాదం సంభవించిందని ఆ అగంతకుడు తెలిపాడు. కాగా ఆ చెట్టు కింద ఎక్కువ మంది గుమిగూడి ఉండటం కొమ్మపై గద్ద వేలాడుతూ ఉండటాన్ని గుర్తించి పెద్ద నిచ్చెన సహాయంతో దాన్ని రక్షించి, సపర్యలు చేసి ఉద్యానవనంలో విడిచి పెట్టారు.

# సమయం కవి

## 'ధరలు ధరువు'

సరైనదా...? సరికానిదా...?
ధరలు ధరువు బరువనీ...
దినం వారి జీవనలో, కూలివాళ్ళు యెలాగనీ...? "స"
ఏమియీ పాలననీ....
సర్కారులు దిగజారుడు తనమనీ...
అడకత్తిరి నొక్కుల్లో, కూలివాళ్ళు జనమనీ...
పుష్టిగ తిండికి నోచుకోలేరనీ... "స"
భాగ్యాలు పుడమిన ఇలాగే మనీ...
సిరిభారతి నేలన యిలాగేలనీ...
పండెంలా పోట్లాటలు పదవులకే...
ఎంతైనా ఖర్చుకి వుందనీ... "స"
దోపిడి వర్గానికి రాజ్యమా...?
బుర్రకొట్టి సంపాదన న్యాయమా...?
ఏమేమి చెపుతారు కాలయాపనా...?
చెప్పినవి యెంతొరకు జరిగెననీ...? "స"
బజారు సంచికి డబ్బేమిన్నా...
ధనమున్న వారికి గొప్ప కాదు, సుమా...
ఒక్కరైన బిడ్డకు - తిండెంతుంది?
తిండిలోన సత్తువే - లేదంటుంది? "స"
ఎన్నెన్నో చూస్తేనే -కడుపు నిండునా...?
కడుపు నిండే రోజులు - ఎప్పుడొచ్చునా...? "స"

... రచయిత
మజ్జి శ్యామసుందరరావు
సెల్ నెం: 9290839512

# పంచాంగం

మాసం : మార్గశిర; తిథి : చవితి రా.11.36;
పూర్వాషాడ తె.4.44; మ.వ.12.48ల 2,34

బుధవారం
22-11-2017

**మేషం** : కోళ్ళ, గొఱ్ఱె, పాడి పరిశ్రమ రంగాలలో వారికి పురోభివృద్ధి కానవస్తుంది. మీ శ్రమకుతగిన ప్రతిఫలం కానవస్తుంది. ఉద్యోగస్తులకు అధికారులతో అవగాహన లోపం, తోటివారి సహకారం లభిస్తుంది. **వృషభం** : నిరుద్యోగులు, వృత్తులు, ప్రింటింగ్ రంగాల వారికి ఆశాజనకం. మీ శ్రీమతి వైఖరి ఆగ్రహం కలిగిస్తుంది. మీ సోదరుల తీరు మీకెంతో మనస్తాపం కలిగిస్తుంది. ఆత్మీయులకు, చిన్నారులకు విలువైన కానుకలందిస్తారు. వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్సలు పూర్తి చేస్తారు. **మిథునం** : చిట్స్, ఫైనాన్స్, రియల్ ఎస్టేట్ రంగాల వారికి కొత్త ఆలోచనలు స్ఫురిస్తాయి. కొంతమంది మీ వ్యాఖ్యలను అపార్థం చేసుకుంటారు. ఎంతో శ్రమించిన మీదట గాని అనుకున్న పనులు పూర్తి కావు. స్త్రీలు అభిప్రాయాలకు ఆమోదం లభించదు. **కర్కాటకం** : విద్యార్థులు ప్రేమ వ్యవహారాల్లో ఇబ్బంది లెదుర్కో వలసి వస్తుంది. చిన్ననాటి మిత్రులను కలుసుకుంటారు. రాజకీయ, పారిశ్రామిక రంగాల వారికి అన్ని విధాలా యోగదాయకమైన కాలం. రాజకీయ నాయకులు తరచూ సభలు, సమావేశాల్లో పాల్గొంటారు. పండ్లు, పూల, కొబ్బరి వ్యాపారులకు అనుకూలమైన కాలం. **సింహం** : ఒక వ్యవహారం నిమిత్తం ప్లీడర్లతో సంప్రదిం పులు జరుపుతారు. ఉద్యోగంలో శ్రమకు నైపుణ్యతకు మంచి గుర్తింపు లభిస్తుంది. కుటుంబీకుల మధ్య ఆసక్తిరకమైన విషయాలు చర్చకు వస్తాయి. అనుకున్న పనులు కాస్త ఆలస్యమైనా కంగారు పడకండి. **కన్య** : పాత మిత్రుల కలయిక సంతృప్తినిస్తుంది. తలపెట్టిన పనులలో విఘ్నాలు, చీటికి మాటికి అసహనం ఎదుర్కొంటారు. మీ జీవిత భాగస్వామి సలహా పాటిస్తారు. వస్త్రాలు, విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. దైవ కార్యక్రమాలలో పాల్గొంటారు. మీ సంతానం విద్య, వివాహ విషయాల పట్ల శ్రద్ధ కనబరుస్తారు. **తుల** : మీ కావలసిన వస్తువులు లేక పత్రాలు కనిపించకుండా పోయే ఆస్కారం ఉంది. స్త్రీలకు ఆరో గ్యంలో చికాకులు తప్పవు మెళకువ వహించండి. మీ వ్యక్తిగత భావాలకు మంచి స్ఫురణ లభిస్తుంది. ఫాన్సీ, కిళ్ళీ, కిరాణా రంగాలలో వారికి అనుకూలం. ఐరన్, సిమెంటు, కలప, ఇనుము, ఇసుక, ఇటుక వ్యాపారస్తులకు లాభదాయకం. **వృశ్చికం** : ఉపాధ్యాయులకు యాజమాన్యం ఒత్తిడి అధికం. ప్రముఖుల సహకారంతో ఒక వ్యవహారం సానుకూలమవుతుంది. ప్రింటింగ్ రంగాల వారికి బకాయిలు వసూళ్ళలో శ్రమాధిక్యత, ప్రయాసలు తప్పవు. కష్ట సమయంలో మిత్రులు అండగా నిలుస్తారు. ముఖ్యుల కోసం షాపింగ్ చేస్తారు. వృత్తులు వారికి సామాన్యం. **ధనుస్సు** : మీరంటే అందరికీ గౌరవం ఏర్పడుతుంది. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరం. వృత్తి విద్యా కోర్సులో రాణిస్తారు. మిమ్మల్ని తక్కువ అంచనావేసే వారు మీ సహాయం అర్థిస్తారు. బంగారం, వెండి, లోహ రంగాలలో వారికి మందకొడిగా వుండగలదు. **మకరం** : దేవాలయ, విద్యా సంస్థలకు దాన ధర్మాలు చేయుట వలన మీ కీర్తి ప్రతిష్ఠలు ఇనుమ డిస్తాయి. ప్రముఖులకు కాను కలు, శుభాకాంక్షలందించి వారిని ప్రసన్నం చేసుకుంటారు. ఆదాయం సంతృప్తి కరంగా ఉంటుంది. విద్యార్థులకు నిరుత్సాహం కానవస్తుంది. వాహనం నడుపు నపుడు మెలకువ, ఏకాగ్రత చాలా అవసరం. **కుంభం** :భాగస్వామిక చర్చల్లో కొత్త విషయాలు చోటు చేసుకుంటాయి. స్త్రీలతో సంభాషించేటపుడు ఓర్పు, సంయమనం పాటించండి. బ్యాంకింగ్ వ్యవహారాలలో మెళకువ అవసరం. ఏదైనా స్థిరాస్తి అమ్మకం చేయా లనే మీ ఆలోచన మరి కొంత కాలం వాయిదా వేయడం మంచిది. **మీనం** : పదవీ స్వీకారాలకు, వృత్తి వ్యాపారాల్లో కొత్త వ్యూహాలు అమలుకు అనుకూలమైన రోజు. వ్యవసాయ, ఎగుమతి, దిగు మతులు లాభిస్తాయి. ఒక కార్యం నిమిత్తం దూర ప్రయాణం చేయవలసి వస్తుంది. పాత రుణాలు తీరుస్తారు.

# హనుమాన్ చాలీసా యొక్క ప్రాముఖ్యత




హనుమాన్ చాలీసా అంటే ఆత్మలకు భయం అని మరియు హనుమంతుడు అంటేనే ర్యానికి మారుపేరు అని తెలియచెప్పిన ఈ చాలీసా అత్యంత ప్రసిద్ధి చెందింది. అత్యంత శక్తివంతమైనది అని పిలువబడుతున్న ఈ హనుమాన్ చాలీసాను శ్రీరామచంద్ర భక్తుడు గొప్ప నైష్ఠిక భక్తుడు, తులసీదాస్ రచించారు. తులసీదాస్, రచించిన రచనలలో అత్యంత ఉత్తమమైనది, ముఖ్యమైనది తులసీ రామా యణము. హనుమాన్ చాలీసా ప్రాము ఖ్యత ఏమిటి అనే ప్రశ్నకు వస్తే, చాలీసాలోని శ్లోకాలకు అర్థమేమిటి, దీనియొక్క శక్తివంత మైన మహిమ ఏమిటి అనే విషయాన్ని మనం తెలుసు కుందాము. ఈ వ్యాసం హనుమాన్ చాలీసా యొక్క ప్రాముఖ్యత గురించి తెలియ చెపుతుంది. దాదాపు హనుమాన్ చాలీసాలోని ప్రతి పదం అనేక రకాల ప్రయోజనాలతో ముడిపడి ఉంది. వివిధ శ్లోకాలను దోహాలుగా కూడా పిలుస్తారు. చాలీసాలోని కొన్ని ముఖ్యమె%న శ్లోకాలను మరియు హనుమాన్ చాలీసా చదవటంవలన కలిగే మొత్తం ప్రయోజనాలను మనం ఇక్కడ పరిశీలిద్దాం.

హనుమాన్ చాలీసాలోని ప్రారంభ దోహా జయ హనుమాన్ జ్ఞాన గుణ సాగర వల్లే వెయటం వలన జీవితంలో స్వాభావిక దివ్య జ్ఞానాన్ని పొందుతారు. ఈ జ్ఞాన సహాయంతో, జీవితంలో ప్రతిష్టంభించిన అనేక సవాళ్లు, దాదాపు అసాధ్యం అనుకున్న వాటిని సాధించగలుగుతారు. మహావీర్ విక్రమార్కుడుతో మొదలయ్యే 'మూడవ దోహా' ప్రజలలో బలాన్ని నింపుతుంది మరియు అవాంఛనీయమైన సహవాస ప్రభావాలనుండి బయట పడడానికి సహాయ పడుతుంది. చాలీసాలోని ఏడవ మరియు ఎనిమిదవ శ్లోకాలు, శ్రీరాముడి ఆత్మతత్వాన్ని అర్థం తెలియచేస్తాయి మరియు దేవుని దివ్యసన్నిధికి చేరువ చేస్తాయి. 14వ మరియు 15వ దోహాలు ఒక వ్యక్తి కీర్తిప్రతిష్టలు పొందటానికి సహాయం చేస్తాయి. మీ పనులు నిర్వహించడానికి కావలసిన సామర్థ్యం మరియు మీ సామ ర్థ్యం పట్ల అందరి ప్రశం సలు అందు కుంటారు. 11వ ఛౌపయి చదవటం వలన పాములు మరియు విష జంతువుల భయం తొలగించ డానికి సహాయం లభిస్తుంది. 16వ మరియు 17 ఛౌపయిస్ చదటం వలన జీవితంలో కోరుకున్న స్థానానికి ఎదగటానికి సహాయ పడుతుంది. అది ఒక కార్యాలయంలో వద్ద ప్రమోషన్లు కావొచ్చు లేదా ఉద్యోగానికి సంబంధించినది అయి ఉండవొచ్చు. 20వ దోహా చదవటం వలన జీవితంలో అనేక సవాళ్లను అధిగమించవొచ్చు మరియు అనేక అడ్డంకులు తొలగిపోయి లక్ష్యాలను సాధించడంలో సహాయపడుతుంది. 24వ ఛౌపయి, ముఖ్యమైనది, ఢాకిణి పిశాచాలు, భూతాలు మరియు చేతబడి ప్రభావాలు పడకుండా ఉండటానికి సహాయ పడుతుంది.

చాలీసాలోని ప్రతి దోహాతో ముడిపడి జీవులకు అనేక లాభాలు ఉన్నాయి. అందువలన హనుమాన్ చాలీసాకు గొప్ప ప్రాముఖ్యత ఉన్నది.

సంకీర్తన



రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
విజయభాను క్లాసిఫైడ్స్
Minimum 7 days
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

# మార్చురీలో మృతదేహాలు భద్రం

యలమంచిలి రూరల్ : జాతీయ రహదారిపై కొక్కొరాపల్లి జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఇద్దరు మృత దేహాలను మార్చురీలో భద్రపరిచినట్లు రూరల్ ఎస్సై చక్రధర్‌రావు తెలిపారు. జార్ఖండ్ రాష్ట్రం గిరిధ్ జిల్లాకు చెందిన అశోక్‌సాహు, కర్నాటక రాష్ట్రం నబిబిఆర్‌తహసీల్దారులు మృతి చెందిన సంగతి తెలిసిందే. కొక్కిరాపల్లి జంక్షన్ వద్ద రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని విశాఖ నుంచి తుని వైపు వెళ్తున్న వ్యాన్ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు.మృతి చెందిన వీరిద్దరి మృత దేహాలను మార్చురీలో ఉంచారు. వీరి బంధువులు రాగానే శవ పంచనామా చేయడం జరుగుతుందని ఎస్సై చక్రధర్‌రావు తెలిపారు.

# దడ పుట్టిస్తున్న దర్గా సెంటర్


పెద్దాపురం: పెద్దాపురం పట్టణానికి అత్యంత ప్రధానమైన సెంటరు దర్గా సెంటరు. ఈ సెంటరు నుండి తూర్పు వైపుకు తుని, కాకినాడ, యానాం వరకు-పడమర వైపుకు రాజమండ్రి, ఏలేశ్వరం, అడ్డతీగల వరకు, దక్షిణం వైపుకు ఆర్‌బి పట్నం, బిక్కవోలు వరకు, ఉత్తరం వైపుకు కాండ్రకోట, తామరాడ, యర్రవం జాతీయ రహదారి వరకు ప్రయాణికులు నిరంతరం రాక పోకలు సాగిస్తుంటారు. ఈ సెంటరు సుమారు 40 గ్రామాల ప్రజల నిత్యావసరాల కొరకు, వ్యాపార లావాదేవీలకు, బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాలకు నిత్యం రాక తప్పదు. ఈ సెంటరు మెయిన్‌రోడ్డు వెడల్పు చిన్నది కావడం, రోడ్డుకి ఇరుప్రక్కల వ్యాపార కొట్లు ఉండటంతో సెంటరు అత్యంత రద్దీగా తయారైయింది. ఉదయం 6గంటల నుండి 10 గం॥ల వరకు, సాయంత్రం 4గం॥ల నుండి రాత్రి 8 గం॥ల వరకు బస్సులు, లారీలు, ఆటోలు, చిన్నకార్లు, మోటారు వాహనాలు మొ॥ అనేక రకాల వాహనాలు రావడంతో గంటల తరబడి సెంటరు వద్ద వాహనాలు నిలిచిపోయి ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ దర్గా సెంటరు వద్ద ట్రాఫిక్ నియంత్రించడానికి పాలకులు ఏ విధమైన చర్యలు తీసుకొనకపోవడం పట్ల ప్రజలు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో పాండవుల మెట్ట వద్ద రోడ్డు వెడల్పు చేస్తున్నట్లు గానీ, దర్గా సెంటరుకు నాలుగు వైపుల రోడ్డు విస్తరణ చేసి, ట్రాఫిక్ అంతరాయం లేకుండా, ప్రయాణికుల రాకపోకలకు సౌకర్యం కలిగించాలని ప్రజలు కోరుతున్నారు.

# ప్రజారోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి

కాజులూరు : గ్రామాల్లో అపరిశుభ్రతను నిర్మూలించి ప్రజారోగ్య పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని మండల బీజేపీ అధ్యక్షుడు దూడల శంకర నారాయణమూర్తి డిమాండ్ చేశారు.

నామవానిపాలెంలో బీజేపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పబ్బినేని నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి స్వచ్ఛభారత్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు మంజూరు చేస్తోందన్నారు. అయితే అవి పక్కదారి పట్టడంలో కేంద్ర ప్రభుత్వం లక్ష్యం దెబ్బతింటుందని ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారన్నారు. ఆరోగ్యవాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్య క్రమంలో పార్టీ మండల కార్యదర్శి యాళ్ళ వీరాం జనేయ, సతీష్, గళ్లా సత్తిబాబు, భాస్కరశర్మ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనేతరుల సమస్యలను పట్టించుకోవాలి



దేవరాపల్లి : అనంతగిరి మండలం లోని పెదగంగవరం గ్రామ గిరిజనేతరుల సమస్యలను పట్టించుకోవాలని గిరిజన సంక్షమ శాఖ మంత్రి నక్క ఆనందబాబు రెవెన్యు మంత్రి కృష్ణ మూర్తి రాజుకు టీడీపీ జిల్లా నాయకులు గాలి రవి కుమార్ సమక్షం లో మంగళవారం వినతి పత్రం అందజేశారు. పెదగంగవరం గ్రామంలో సుమారు 150 కుటుంబాలు గిరిజనేతరులంటూ ఎటువంటి హక్కులు పొందలేకపోతున్నారని వారు మంత్రికి వివరించారు .దీని వలన ఇక్కడ నివసించే కుటుంబాలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు ఎప్పటికైనా తమ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి తమకు నాయ్యం చేయాలని కోరారు .రవి కుమార్ వెంట కె వి రమణ ,మిడతాడా అప్పారావు ,బైలపూడి అప్పారావు, గుళ్ళపల్లి అర్జన తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 26 నుండి జిల్లాస్థాయి ఆటల పోటీలు...



జిల్లా స్థాయి క్రీడల ఆర్గనైజింగు కార్యదర్శి జి.రాంబాబు

చోడవరం: ఈ నెల 26 నుండి 28 వరకు స్థానిక ప్రభుత్వ జూనియరు కళాశాల మైదానంలో జిల్లా స్థాయి బాలుర ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు ఆటల పోటీల ఆర్గనైజింగు కార్యదర్శి, చోడవరం జూనియరు కళాశాల పి.డి. జి.రాంబాబు మంగళవారం స్థానిక విలేఖరులకు తెలియజేసారు. 16 నుండి 19 సంవత్సరాల వయసు కలిగి ఏదైనా ప్రయివేటు, ఎయిడెడు కళాశాల విద్యార్థులు (బాలురు) పాల్గొనవచ్చునని తెలిపారు. ఈ గ్రిక్స్‌లో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, టెన్నీకాయిట్, బాల్‌బ్యాడ్మింటన్, త్రోబాల్ తదితర ఈవెంట్లు ఉంటాయని తెలిపారు.

# మైక్యూర్ ఉచిత వైద్య శిబిరం

విశాఖపట్నం: ఆర్కేబీచ్ దగ్గరలో ఉన్న సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్, నాటికల్ అండ్ ఇంజనీరింగ్ ట్రైనింగ్ కేంద్రంలో మైక్యూర్ హాస్పిటల్ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మైక్యూర్ ఆస్పత్రి సౌజన్యంతో నిర్వహించిన కార్డియాక్ స్క్రీనింగ్ ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఈ శిబిరాన్ని సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్, నాటికల్ అండ్ ఇంజనీరింగ్ కార్యాలయం అధిపతి సునీల్.బి.రంగై ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు సమీరా, వైద్య బృందం 35 మందికి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉన్నత అధ్యాపకులు, బనాహృషికేష్, బిసోయి, అధ్యాపకులు జి.వెంకటేశ్వర్లు, సి.హెచ్.కృష్ణరావు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సింహగిరీశుని నిత్యాన్నదానంకు రూ.1.50లక్షలు విరాళం



సింహాచలం : సింహాద్రినాధునికి నిత్యాన్న దాన ప్రసాదంకు సబ్బవరం మండ లంకు చెందిన లక్ష్మిరూ.50,000/- , లారెస్ ల్యాబ్స్ కు చదనిన డాక్టర్ సత్యన్నారాయణ చావాలు రూ.1,00,000/-లు తమ కుటుంబసభ్యులతో కలసి ఆలయ అధికారులకు అందించారు. వీరికి ఆలయ మర్యాదలప్రకారం స్వామివారి ప్రత్యేక దర్శనం, వేదపండితులచే ఆశీర్వచనం చేయించి ప్రసాదాలను అందజేశారు. స్వామి వారికి భక్తులు, దాతలు ఏమైనా వస్తువులు, ధన, చెక్కు, డిడి రూపేణావిరాళం ఇచ్చినా సంబందిత అధికారివద్ద తగు రసీదు పొందాలని లేదంటే వారు ఇచ్చినా విరాళాలు స్వామివారికి చెందవు అని ఓప్రకటనలో అధికారులు తెలిపారు.

డిపాజిట్ చేసిన మొత్తం నుంచి వచ్చిన వడ్డీతో భక్తులు కోరినరోజు అన్నదానం నిర్వహించటం జరుగుతుంది. దాతలకు ఎటు వంటి సమాచారం కావాలన్న 9491000635 నెంబర్ కు సంప్రదించవచ్చు లేదంటే నేరుగా మమ్మల్ని అంటే దేవస్థానం కార్య నిర్వాహణాధికారి వారిని సంప్రదించగలరని కార్య నిర్వాహణాకారి కోడూరి అచ్చుత రామ చంద్రమోహన్ కోరారు.

# పంచాయతీ కార్యదర్శి ఉన్నాడా?ఉన్నా లేనట్లేనా?

## --పంచాయతీ ఆస్తులు ద్వంస0 చేస్తున్నా పట్టించుకునే నాధుడే లేడు

## --సహచట్టం అంటేనే లెక్క లేదు

పెదపూడి:జిల్లా కేంద్రమైన కాకినాడకు కూత వేటు దూరంలో ఉన్న ఓ పల్లెలో అసలు ప్రజాస్వామ్యం నడుస్తుందా,,,లేక అరాచక శక్తులు రాజ్యమేలుతున్నాయా అనే అనుమానాలు తలెత్తుతున్నాయి కాకినాడ రూరల్ సూర్యారావు పేట పంచాయతీ లో దేశం తమ్ముళ్లు చేస్తున్న అక్రమాలను అడ్డుకునే నాధుడే లేడు పదిమంది పట్టుకునే మంచినీటి ట్యాంక్ గుట్టును ఒక వ్యక్తి దౌర్జన్యం గా బద్దలు కొట్టి ఇల్లు కడుతుంటే అడ్డుకోవాల్సిన పంచాయతీ అధికారి చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నదని స్థానికులు ఆరోపిస్తున్నారు సమస్యలను తీర్చవలిసిన అధికార పార్టీ నాయకులు అక్రమాలకు పాల్పడుతుంటే మిగిలిన వారి పరిస్థితి ఎలా ఉంటుంది అంతే కాకుండా ఎన్టీఆర్ సుజలా పధకం కింద విడుదల అయిన వాటర్ ప్లాంట్ పట్టుమని 10నెలలు మంచి నీరు అందించలేకపోయింది సూమరు 6నెలల నుండి వాటర్ ప్లాంట్ పనిచేయక మంచి నీటి కోసం గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు వీటన్నింటినీ పట్టించుకోవల్సిన పంచాయితీ కార్యదర్శి మాత్రం కనిపించడం లేదని స్థానికుల ఆరోపిస్తున్నారు అక్రమంగా వాటర్ ట్యాంక్ గుట్టును బద్ధలు కొట్టారని దీనిపై సమాచారహక్కు చట్టం క్రింద కార్యదర్శికి పిర్యాదు ఇచ్చి వారం కావస్తున్నా దానికి సంబంధించిన కౌంటర్ ఫైల్ ఇప్పటి వరకు ఇవ్వలేదని రాజు ఆరోపించారు ధీంతో తాను మండల కార్యాలయానికి వెళ్లి మరల సమాచారహక్కు చట్టం ప్రకారం పిర్యాదు చేయడం జరిగింది అన్నారు ట్యాంక్ గట్టు బద్దలు కొట్టడానికి పంచాయతీ తీర్మానం చేసి ఉంటే వాటి వివరాలు ఇవ్వమని కార్యదర్శి అడిగితే తాత్సారం చేస్తున్నారని ఈలోగా ఆక్ర మణ దారుడు దెయ్యాల ధర్మరాజు యథేచ్ఛగా నిర్మాణాన్ని కొనసాగిస్తున్నాడని కేవలం తెలుగుదేశం నాయకుల దురాఘాతలకు అడ్డులేకుండా పోయిందన్నారు కార్యదర్శి సకాలంలో స్పందికపోతే కలెక్టర్ కి పిర్యాదు చేస్తామని తెలిపారు.

# వ్యాసరచన పోటీలలో బల్లా నాగభూషణంకు ప్రథమ బహుమతి

అనకాపల్లి: 50వ గ్రంధాలయ వారోత్సవాలు ముగింపు సందర్భంగా స్థానిక శాఖా వీధి శాఖా గ్రంథాలయంలో పుస్తకమే సమస్తము- గ్రంధాలయాల అభివృద్ధిలో వయోవృద్ధుల పాత్ర అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలలో సామాజిక కార్యకర్త బల్లా నాగభూషణంకు ప్రదమ బహుమతి వచ్చింది. బహుమతిని వివేకాంనంద ఛారిటబుల్ ట్రస్టు అధ్యక్షకార్యదర్శులు కె.విస్ణు మూర్తి, డా॥ కె.వి.సత్యవతి, మాజీ గ్రంధాలయ సంస్థ చైర్మన్ తోట నగేష్‌లు అందజేశారు. కార్యక్రమంలో గ్రంధాలయ అధికారిణి కె.సాయాదేవి, జైలు సూపరింటెండెంట్ ఒమ్మి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

# డిసెంబర్ 15 నాటికి మరుగుదొడ్ల నిర్మాణాలు ప్రారంభిస్తాం

**జిల్లా కలెక్టర్ వివేక్‌యాదవ్**



విజయనగరం : జిల్లాలో మరుగుదొడ్డి లేని ప్రతి కుటుంబం ప్రభుత్వం మంజూరు చేసి ప్రోత్సాహక మొత్తంతో డిసెంబర్ 15 నాటికి మరుగుదొడ్డి నిర్మాణం ప్రారంభించే దిశగా చర్యలు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ వివేక్ యాదవ్ చెప్పారు. జిల్లాను వచ్చే ఫిబ్రవరి 15 నాటికి బహిరంగ మలవిసర్జన రహితంగా రూపొందించాలన్నదే తమ లక్ష్యమని పేర్కొన్నారు.అన్ని గ్రామాల్లోను ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాలను ఏర్పాటు చేసి స్వచ్ఛ గ్రామాలుగా రూపొందిస్తామన్నారు. జెడ్పీ టీసీ సభ్యుడు తుంపిల్లి రమణ, పాండ్రంకి గౌరీశ్వరప్పడు, సుబ్బారావు, టి.వెంకటేశ్వరరావు, కె.వి.జె.మురళి, ఎస్.ఇ.రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలతో పారిశుధ్య పరి రక్షణకు కృషి చేస్తామని సంకల్ప ప్రతిజ్ఞ చేయించారు.

# కంజరవేన్సీ కార్మికులకు న్యాయం చేయాలి



గాజువాక: స్టీల్ ప్లాంట్ లో బాత్ రూమ్స్ క్లీనింగ్ పనిచేస్తున్న స్వీపర్స్‌కు న్యాయం చేయాలని స్టీల్ ప్లాంట్ ఇ.డి (వర్క్స్) రమణ టియన్‌టియుసి ప్రధాన కార్యదర్శి బొడ్డు పైడిరాజు వినతి పత్రాన్ని అందజేసారు. మంగళవారం ఇడి కార్యాలయంలో ఆమెను కలిసి స్టీల్ ప్లాంట్ లో విధులు నిర్వహిస్తున్న బాత్‌రూం క్లీనింగ్ స్వీపర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా పైడిరాజు మాట్లాడుతూ గత 25సం.నుంచి కాంట్రాక్టు కార్మికులుగా బాత్‌రూం క్లీనింగ్ స్వీపర్స్ విధులు నిర్వహిస్తున్నారని, అయితే వారికి ఎటువంటి ఉద్యోగ భద్రత కల్పించక పోవడం దారుణమని అన్నారు. సుమారు 45మంది దీనిపై ఆదార పడివున్నారని సులభ్ కాంప్లెక్స్ మార్పు చేయడం వలన స్వీపర్స్‌కు నష్టం జరుగుతుందని, అందువలన వారికి తగిన న్యాయం చేయాలని వినతి పత్రంలో కోరినట్లు తెలిపారు. ఇ.డి రమణ స్పందిస్తూ వారికి తగిన న్యాయం చేసేందుకు చర్యలు చేపడతామని తెలిపారు.

వినతి పత్రం అందించిన వారిలో టియన్‌టియుసి అధ్యక్షులు కరణం సత్యారావు, కోనరాజు, కణితిలోవరాజు, సప్ప పెద వెంకట రావు, శ్రీనివాసరావు, చినబాబు, అప్పారావు, సారిపిల్లి అప్పారావు, నాగరాజు, కె.పైడిరాజు, బి.నాయుడు, జి.కనకారావు, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

# వైద్య శిబిరానికి స్పందన

నాతవరం : నర్సీపట్నం లైఫ్ లైన్ ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో నాతవరం షిర్డిసాయి స్వచ్ఛంధ సంస్థ సౌజన్యంతో నాతవరం జిల్లా పరిషత్ పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ మెడికల్ క్యాంపుకు మండల కేంద్రంలోని ప్రజలతో పాటు పరిసర ప్రాంతాల్లోని గ్రామస్థులు కూడా అధిక సంఖ్యలో వచ్చి పరీక్షలు నిర్వహించుకొని మందులు తీసుకున్నారు. ఈ సందర్భంగా స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ జి.విజయశాంతి మాట్లాడుతూ ఇటువంటి మెడికల్ క్యాంపులు నిర్వహించడం వల్ల దూర ప్రాంతాలకు వెళ్లి వైద్యం చేయించుకునేవారికి ఎంతో దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రణతి, షిర్డిసాయి స్వచ్ఛంధ సంస్థ శెట్టి సతీష్, చింతకాయల శేషగిరి ఉన్నారు.

ఇళ్లు, అపార్ట్‌మెంట్, ఇళ్ల స్థలములు కొనాలన్నా, అమ్మాలన్నా, తనఖా, అన్ని రకముల లోన్ సదుపాయములు బ్యాంక్ ద్వారా సమకూర్చుటకు సంప్రదించగలరు.
79815 79817

# విద్యుత్తు స్తంభం మీద పడి వ్యవసాయ కూలీ మృతి






ప్రమాద స్థలంలో విగత జీవిగా పడిఉన్న కుర్రు రమణ

చోడవరం : మండలం లోని ఖండేపల్లి శివారు ఎం.ఏ. జయపాల్ రెడ్డికు చెందిన పామాయిల్ తోటలో మంగళ వారం జరిగిన ఓ ప్రమాదంలో దామునాపల్లికు చెందిన వ్యవసాయ కూలీ కుర్రు రమణ(55) మృతి చెందాడు. దీనిపై ప్రత్యక్ష సాక్షులు, మృతుని కుటుంభ సభ్యులు తెలియ జేసిన వివరాలు ఇలా ఉన్నాయి. జయపాల్ రెడ్డి పామాయిల్ తోటలో ఉన్న యూకలిప్టస్ చెట్లను బుచ్చెయ్యపేటకు చెందిన పెదిరెడ్ల ఈశ్వరరావు కొనుగోలు చేసాడు. యూకలిప్టస్ చెట్లను నరికేందుకు నాలుగురోజుల క్రితం దామునా పల్లికి చెందిన కూలీలను నియమించుకున్నాడు. వారిలో మృతుడు రమణతో పాటు దామునా పల్లికు చెందిన పాతాళం సత్తిబాబు, మరో ముగ్గురు ఉన్నారు. మూడు నుండి ఇక్కడి తోటలో యూకలిప్టస్ చెట్లను వారు నరుకు తున్నారు. రోజూలాగానే మంగళవారం కూడా చెట్లను నరుకుతుండగా వాటి కొమ్మ విద్యుత్తు వైర్లు మీద పడటంతో ఆ బరువుకు దగ్గరలోని విద్యుత్తు స్థంబం ఒక్కసారిగా చెట్లు నరుకుతున్న రమణ తలపై పడింది. దీంతో రమణ అక్కడి కక్కడే మృతి చెందగా మిగిలిన వారు ప్రమాదం నుండి తప్పించుకోగలిగారు. దీనిపై ప్రమాదం బయిటపడిన కూలీలు హుటాహుటిన ఖండపల్లి వీఆర్వో సింహాచలం, సర్పంచ్ జెట్టి మాణిక్యంకు ప్రమాద విషయం తెలియజేసారు. మృతుని కుమారుడు వరహాలునాయుడు ఫిర్యాదు మేరకు చోడవరం స్టేషన్ హెచ్.సి. లోకేశ్వరరావు ప్రమాదస్థలికి వెళ్లి వివరాలు సేకరించారు. శవ పంచనామా అనంతరం పోష్టుమార్టం నిమిత్తం చోడవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్టేషన్ ఎస్సై కె.మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు రమణకు భార్య సోములమ్మ, కుమారుడు వరహాలు నాయుడు ఉన్నారు. ఉదయం కూలీపనులకు బయిటకు వెళ్లిన కుటుంభ యాజమాని, వెళ్లిన కొద్ది గంటలకే విగత జీవి అయ్యాడనే వార్తను వారు జీర్ణించు కోలేకపోతున్నారు. రమణ మృతితో దామునాపల్లి శోక సంద్రంగా మారింది.

# పేద బి.టెక్ విద్యార్థికి ల్యాప్‌టాప్‌ను అందించిన వైకాపా నేత సురేష్



సింథియా: బి.టెక్ విద్యలో ఉత్తమంగా రాణిస్తున్న పేద విద్యార్థి దుర్గా ప్రసాద్‌కు పి.వి. హెల్ఫింగ్ హ్యాండ్స్ చారిటబుల్ సంస్థ చైర్మన్, 47వ వార్డు వైకాపా అధ్యక్షులు పి.వి.సురేష్ ఒక ల్యాప్‌టాప్‌ను సోమవారం అందజేసారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ ఎంతో ప్రతిభ కల్గి చదువుకునే స్థోమత లేక ఎంతో మంది పేద విద్యార్థులు మరుగు పడిపోతున్నారని, వారి సేవలు దేశానికి ఎంతో అవసరమని, అలాంటి వారిని గుర్తించి ప్రోత్సహించాలని అందుకు ప్రభుత్వం తగిన చొరవ చూపాలన కోరారు. దుర్గా ప్రసాద్ విజ్ఞాన్ కళాశాలలో బి.టెక్ 3వ.సం. చదువుతున్నాడని, చదువులో 97శాతం మార్కులతో ఉత్తమ విద్యారి ఉత్తమ ప్రతిభ కనభరుస్తూ ముందుకు వెళుతున్నాడని, ఇది గర్వించ దగ్గ విషయంమని అన్నారు. ఈ విషయం తమ దృష్టికి రావడంతో పి.వి.హెల్ఫింగ్ హ్యాండ్స్ చారిటబుల్ సంస్థ ద్వారా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. పి.వి.హెల్ఫింగ్ హ్యాండ్స్ చారిటబుల్ సంస్థ ఎప్పుడూ పేద వారికి చేయూత నిస్తుందని తెలిపారు. ఈ కార్య క్రమంలో చారిటబుల్ సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వేలం ప్రకటన

**మహారాజశ్రీ బొబ్బిలి సీనియర్ సివిల్ జడ్జికోర్టు వారి దివ్య సముఖనకు**

**E.P.9/2017 IN O.S.5/15**

బిట్వీన్:
బోగి ధనుంజయరావు ...డిక్రీ హోల్డర్
ఎండ్:
సిరిపురపు శ్రీనివాసరావు ...జడ్జిమెంటు డెబ్టార్స్

పై నెంబరుకు అమలును డి.హెచ్.ఆర్ అమలు బాకీ రాబట్టుకొను నిమిత్తం జె.డి.ఆర్ పైని దాఖలు చేసియున్నారు. పై నెంబరు అమలులో జె.డి.ఆర్ యొక్క హక్కు అనుభవములో ఉన్నట్టువంటి ఈ దిగువ ఉదహరించిన షెడ్యూలు దాఖలా స్థిరాస్థిని **తేది:04.12.2017 దిని ఉదయం గం॥ 10.30 ని॥ల** నుండి పై కోర్టులో బహిరంగ వేలాం వేయుబడును. కావున కావలసిన వారు వచ్చి వేలం పాటలో పాల్గొనవచ్చునని యిందుమూలంగా యావన్మందికి తెలియజేయడమైనది.

షెడ్యూలు
జిల్లా : విజయనగరం
మండలం : బొబ్బిలి
గ్రామం & పట్టణం : బొబ్బిలి
వార్డ్ నెం.5, బ్లాక్ నెం.16, డోర్ నెంబరు 16-69
టి.ఎస్.నెం.331/1 పి.బి
ఆస్థి వివరములు :- పెంకిటిల్లు & ఖాళీ స్థలం
మెజర్‌మెంట్స్ : item No.1: East to West : 25 feet
North to South : 30 feet 6 inches
item No.2 : East to West : 30 feet 6 inches
North to South : 22 feet 6 inches
item No.3 : Triangle shop vacant site,
Western Dande: 16 feet 6 inches, Northern dande:2 feet 1.8 Sq.yards
boundaries:
East : Municipal road side drainage
South : Rasta
West : joint wall in between Regulagedda Bharathi and this property
North : joint wall in between this property and Kemburu Rama Krishna rao
D.H.R Value : 3,00,000/-
J.D.R Value : not produced
Amin Value : 6,00,000/-
Further hearing : 18-12-2017

(By order)
Bobbili
Date : 18-11-2017

Sri G.Gopala Krishna Sharma
B.com.,B.L
Advocate for the D.H.R

# రజకుల సంక్షేమం కోసం కార్పోరేషన్ ఏర్పాటు చేయాలి

## ఏపి రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎమ్.భాస్కరయ్య



పిఠాపురం : రాష్ట్రంలో రజకుల సంక్షేమంకోసం కార్పోరేషన్ ఏర్పాటుచేసి రూ.1000 కోట్లు నిధులు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎమ్. భాస్కరయ్య ప్రభుత్వాన్ని డియాండ్ చేశారు. స్థానిక సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం లో సంఘం జిల్లా అధ్యక్షుడు కోనేటి రాజు అధ్యక్షుతన రజక సంఘం సదస్సు జరిగింది. ఈ సంధర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ రజకులపై రాష్ట్రంలో గ్రామ బహిష్కరణలు పెరిగాయన్నారు. కులాంతర వివాహాలు జరిగితే దాడులు ఎక్కువయ్యాయన్నారు. ఈ నేపథ్యంలో సామాజిక రక్షణ కావాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం మాదిరిగానే రజకుల కోసం రక్షణ చట్టాన్ని తీసుకురావాలన్నారు. ఆధునిక పనిముట్లను 90శాతం సబ్సీడీతో అందించాలని కోరారు. గత బడ్జెట్లో రూ.55 కోట్లు మాత్రమే కేటాయించడం రజకులపై ప్రభుత్వ చిన్న చూపుకు ఇది నిదర్శనమన్నారు. ఇప్పటికైనా వచ్చే బడ్జెట్లో రూ.1000 కోట్లు నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధోబీ పోస్టులు భర్తీ చేయాలని నిరుద్యోగ భృతి ఇవ్వాలని, 50 సంవత్సరాలు దాటిన రజకులకు ఫించను ఇవ్వాలని కోరారు. న్యాయమైన తమ డిమాండ్ల పరిష్కారానికి వెట్టి చాకిరీ విముక్తి కోసం వీరోచిత పోరాటం చేసిన చకలి ఐలమ్మ స్ఫూర్తితో పోరాటం చేసేందుకు కార్యచరణ రూపొందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు కె.నాగేశ్వరరావు, ఎదురుపాక రాజు, కోనేటి రామకృష్ణ, పెదపూడి చంటి, గోకివాడ ఎంపిటిసి సత్యవతి, కాకినాడ కృష్ణ, పాలేపు రాంబాబు, కె.త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తరాంధ్ర మత్స్యకారుల అభివృద్ధి సంక్షేమ సేవ సంఘం ఆద్వర్యంలో

# ఘనంగా మత్స్యకారుల దినోత్సవం



భీమినిపట్నం : భీమిలి మండలం కె. నగరపాలెం గ్రామపంచాయతి మంగమారి పేటలో మంగళవారం ఉదయం పది గంటలకు ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం వేడుకలు గణంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి డి.దాసు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోస్తా తొమ్మిది జిల్లాల మత్స్యకారులను ఎస్టీ జాబితా లో చేర్చాలని గత నలభై ఏళ్ళ నుండి పోరాడుతున్నా కేంద్ర ప్రభుత్వం గాని రాష్ట్ర పభుత్వం గాని మమ్మల్ని పట్టిచుకోవడంలేదని అన్ని రాష్ట్రములలో ఇటు తమిళనాడు ఓడిషాలతో కలిపి చాల రాష్ట్రాలు మత్స్యకారులను ఎస్టీ జాబితాలలో చేర్చారని, అలాగే ప్రపంచ దేశాల్లో నిషేదించబడిన కేమికల్ కంపెనీ లైసెన్సులు మన రాష్ట్రంలో ఇప్పించి మా యొక్క కోస్టల్ తొమ్మిది తీర ప్రాంత మత్స్య సంపదను పూర్తిగా కోల్పోవలిసిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. వాసుపల్లి నల్లబాబు మాట్లాడుతూ తుఫాన్ కారణాల వలన నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకుంటారని అదే మత్స్యకారులు నష్టపోతే ఏ ప్రభుత్వము కూడా మమల్ని ఆదుకోవడము లేదు అని అన్నారు. అలాగే అరవై రోజులు పాటు వేటనిషేధం సమయంలో మత్స్యకారులను ఆదుకోవాలని, రాష్ట్రం నలుమూలలా కోటి జనాభా ఉన్న మత్స్యకారులను రాజకీయంగా ఉపయోగించు కుంటున్నారే తప్ప రాజకీయంగా మాకు తగిన ప్రాధ్యాన్యత లభించడం లేదని అన్నారు. మాజీ ఎం.పి.టి.సి.డి. ఏడుకొండలు మాట్లాడుతూ మత్స్యకారులు ఐఖ్యతగా వుండాలని అన్నారు. ఈ సమావేశంలో చుక్కా.భాస్కరరావు, కారి అప్పారావు, వాసుపల్లి. ఎల్లయ, వాసుపల్లి నూకరాజు. ఎం.అమర్ నాథ్, కొల్లి.సూర్యప్రకాష్, తదితరులు పాలుగున్నారు.

# కార్మికులకు బియ్యం పంపిణీ

యానాం : వివిధ రైస్ మిల్లులో పనిచేసే కార్మికులు ప్రమాదాలకు గురైన కుటుంబాలను ఆదుకొనేందుకు యానాం రైస్ మిల్లుల వర్కర్స్ యూనియన్ బియ్యం పంపిణీచేసింది. మంగళవారం ఉదయం దరియాలతిప్పలో ఉంటున్న రైస్‌మిల్లు కార్మికుడు జనిపల్లి లోవరాజు కుటుంబానికి 50 కేజీ లు, దొమ్మేటిపేటలో ఉంటున్న గుత్తుల బాలరాజు కుటుంబానికి 50 కేజీలు, పరంపేటలో తిరుకొటి రాంబాబు కుటుంబానికి 50 కేజీల చొప్పున బియ్యం పంపిణీచేశారు. యూనియన్ అధ్యక్షుడు జి. ఈశ్వరరావు, కార్యదర్శి ఎస్. ధర్మారావు, కోశాధికారి ఎం. శ్రీను, ఉపాధ్యక్షుడు కె. నాగేశ్వరరావు, టి. శ్రీను, డి. రాజు, తదితరులు పాల్గొన్నారు.

# గృహ నిర్మాణ పథకంపై అవగాహన

తాళ్లరేవు : ప్రతిపౌరుడు సొంతింటికల నెరవేర్చుకోవాలని గృహ నిర్మాణ శాఖ అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు డిఎస్ పట్నాయక్ అన్నారు. గోవలంకలోని ప్రధానమంత్రి ఆవాజ్ యోజనపై లబ్ధిదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ పథకాన్ని ప్రవేశపెట్టి ఏడాది కావడంతో లక్ష్యాలను వివరించారు. ఈ పథకంలో లబ్ధిదారులకు రూ. 2 లక్షలతో గృహ నిర్మాణం చేసుకోవచ్చన్నారు. మండలంలో 455 నూతన గృహాలు మంజూరు అయ్యాయని వాటిలో 25 పూర్తి అవ్వగా, 250 ప్రారంభ దశలో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎవి ఎండి షంషుద్దీన్, డిఇ నాగలక్ష్మీ, గోవలంక సర్పంచ్ దండుమీను మల్లిఖార్జునరావు, ఎంపిటిసి బోయిడి శ్రీనుకుమారి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడి కేంద్రాలకు వంటసామగ్రి అందచేత

తాళ్లరేవు : పిల్లలకు పౌష్టికాహారం అందించడంలో జాగ్రత్తలు పాటించాలని సక్రమంగా విద్యాబుద్ధులు నేర్పించాలని గడిమొగ సర్పంచ్ తావూరి సూర్యాకాంతం అన్నారు. గాడిమొగ పంచాయతీ పరిధిలో 10 అంగన్ వాడీ కేంద్రాలకు పంచాయతీ ఆర్థిక సహకారంతో ఏర్పాటుచేసిన వంటసామగ్రిని అందచేసారు. గాడిమొగ, గోపాలపురం, దాబానగర్, పెదవలసల, లక్ష్మీపతిపురం, చినవలసల, తిమ్మరాజపురం, గ్రామాలకు రూ. 50 వేల వ్యయంతో కొనుగోలు చేసిన వంట సామగ్రిని అంగన్‌వాడి కేంద్రాలకు సమకూర్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యుడు మల్లాడి వరదరాజు, ఉపసర్పంచ్ పి. నూకరాజు, పంచాయతీ కార్యదర్శి జివిబివి రాయిల్, వార్డు సభ్యులు మల్లాడి సత్యానందవర్మ, మల్లాడి గంగాధరరావు, బి. ప్రకాష్ తదితరలు పాల్గొన్నారు.

# భాష్యంలో విద్యార్థులకు ఆటల పోటీలు

పిఠాపురం : భాష్యం పాఠశాలలో అంతర్గత జోనల్‌స్థాయి ఆటల పోటీలను పిఠాపురం మున్సిపల్ ఛైర్మన్ కరణం చిన్నారావు ప్రారంభించారు. ఈ సంధర్భంగా చిన్నారావు మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు ఆటల పోటీలు నిర్వహించడంద్వారా మానసిక వికాసం పరిపక్విత చెందుతుందన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ పోలుపర్తి వేణు మాట్లాడుతూ భాష్యం పాఠశాలలల్లో పిఠాపురం, సామర్లకోట, ఏలేశ్వరం, తుని విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించామన్నారు. కోకో, కబడ్డీ, క్యారమ్స్, షటిల్, వాలీబాల్, రన్నింగ్, షాట్‌పుట్ సీనియర్ మరియు జూనియర్ విభాగాల్లో బాలబాలికలకు నిర్వహిస్తున్నామన్నారు.

# జనసేన మహిళా సభ్యత్వం నమోదు

భీమినిపట్నం : తగరపువలస స్థానిక పుట్ బాల్ గ్రౌండ్ లో ఉన్న కళ్యాణ మండపంలో జన మహిళా సేన కార్యక్రమం మంగళవారం ఉదయం నిర్వహించారు. జనసేన ఉత్తరాంధ్ర కో ఆర్డినేటర్ వి.సతీష్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జనసేన మహిళా నేత దుర్గ మాట్లాడుతూ జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ స్థాపించిన ఈ పార్టీలో మహిళలు అత్యధిక సంఖ్యలో పాల్గొనాలని తెలిపారు. మహిళలు ఇంట్లో బాధ్యతే కాదు సమాజ సేవలో పాల్గొనాలనీ చెప్పారు. ఇంకా ఈ కార్యక్రమంలో జనసేన మహిళా నేతలు సుధ, త్రివేణి, అత్యధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# సొసైటీ ఏర్పాటు చేయాలని రైతులు వినతి

ఆలమూరు : ఆలమూరు మండలం, పినపళ్లలోని రైతులకు ప్రత్యేకంగా సహకార సంఘాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ రాజమహేంద్రవరం సహకార శాఖ సహాయ రిజిస్ట్రారు కె.ఉమాపార్వతికి రైతులు వినతిపత్రాన్ని అందజేసారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొత్తూరి వీరన్ననాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సొసైటీ ఆవశ్యకతపై రైతులు ముక్తకంఠంతో వివరించారు. దక్షిణ భారత దేశంలో తొలి సహకార బ్యాంకుగా చరిత్రకెక్కిన ఆలమూరు రూరల్ బ్యాంకు పరిధిలో పినపళ్ల వుండేది. ఆ తరువాత అది సొసైటీగా ఏర్పడటంతో రైతులకు సహకార సంఘం లేకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేసారు.

# చిన్నారులకు దంత వైద్యుల సేవలు



కాకినాడ : ఇండియన్ డెంటల్ అసోసియేషన్ కాకినాడ బ్రాంచ్ ఆధ్వర్యంలో స్థానిక సమాజం ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఉదయం నిర్వహించిన ఉచిత వైద్య మరియు అవగాహన శిబిరాన్ని కార్పొరేటర్ శ్రీమతి సాలిగ్రామలక్ష్మి ప్రసన్న లాంఛనంగా ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న చిన్న పిల్లలకు దంత వైద్య శిబిరాన్ని నిర్వహించేందుకు దంత వైద్యుల సంఘ సభ్యులు ముందుకు రావడం శుభ పరిణామమన్నారు. కార్పొరేసన్‌పరంగా పూర్తి సహాయ సహకారాలను అందిస్తామన్నారు. అసోసియేషన్ అధ్యక్షులు డా.రఘురామ్ మాట్లాడుతూ ఐ.డి.ఎ. ఆధ్వర్యంలో అన్ని నగరపాలక పాఠశాలల్లో ఉచితంగా వైద్య శిబిరాలను నిర్వహిస్తామన్నారు. తాను అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించిన తరువాత తొలి మెడికల్ క్యాంపన్నారు. పిల్లలందరికీ పేస్టులు, బ్రష్‌లను ఉచితంగా అందజేసామన్నారు. దంతాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు రూపొందించిన ప్రత్యేక కరదీపికలను పిల్లలందరికీ పంపిణీ చేసారు. కార్యక్రమంలో కార్యదర్శి ఉపాధ్యక్షులు డా.అడ్డాల సత్యనారాయణ రవిచంద్, డా.కృష్ణ మోహన్, డా.సువర్ణ రాజు, రాష్ట్ర కమిటీ కార్యవర్గ సభ్యులు డా.ప్రవీణ్ రామర్స్, డా.పద్మావతీ దేవి, డా.తన్మయిరామచంద్ర, సమాజం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయిని, శాంతితోపాటు పేరెంట్స్, స్కూల్ సిబ్బంది పలువురు పాల్గొన్నారు

# పద్మావతికి జయంతి రామలక్ష్మణమూర్తి స్మారక పురస్కారం



విశాఖపట్నం : ఉత్తమ గ్రంథపాలకులకు ప్రతీ ఏటా గ్రంథాలయ ఉత్సవాలలో ఇచ్చే జయంతి రామలక్ష్మణమూర్తి పురస్కారానికి పూసపాటిరేగ గ్రంథాలయంకు చెందిన జి.పద్మావతి 2017 సంవత్సరానికి ఎంపికయ్యారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వెన్నేటి శ్రీసూర్యనారాయణమూర్తి ప్రతిపాదించగా సోమవారం రాత్రి గురజాడ స్మారక కేంద్ర గ్రంథాలయంలో జరిగిన ముగింపు ఉత్సవంలో వాసవీక్లబ్ విజయనగరం రూరల్ అధ్యక్షులు సముద్రాల గురుప్రసాద్ పురస్కారాన్ని పద్మావతికి ప్రదానం చేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగులసంఘం అధ్యక్షులు రామభద్రరాజు, సంస్థ డిప్యూటీ లైబ్రేరియన్ పోతురాజు, పలువురు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆదిత్య కళాశాలలో గ్రంధాలయ వారోత్సవాల ముగింపు వేడుకలు




కాకినాడ : ఆదిత్య డిగ్రీ, పి.జీ కళాశాలల ఆధ్వర్యంలో 50వ జాతీయ గ్రంధాలయ వారోత్సవాలు ముగింపు ఉత్సవాల సందర్భంగా ముఖ్య అతిథులుగా ఆదిత్య విద్యాసంస్థల సమన్వయకర్త బి.ఇ.వి.యల్.నాయుడు, ఛీఫ్ గెస్ట్ ఎ.యు. పి.జీ.క్యాంపస్ లైబ్రేరి ప్రొఫెసర్ దొసగిరిరావు, ప్రిన్సిపాల్స్ డా॥ జి. శ్రీనివాసరావు, శ్రీమతి డి. బ్యూలా మరియు శ్రీమతి కరుణ,ఛీఫ్ లైబ్రేరియన్ యస్.వి.ఆర్. ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ బి.ఇ.వి.యల్.నాయుడు మాట్లాడుతూ పుస్తకాలు చదవటం అలవాటు చేసుకుంటే జ్ఞానసముపార్జన సాధ్యమవుతుందని, ప్రతి విద్యార్థి, విద్యార్థునులు గ్రంధాలయానికి వచ్చి పుస్తకాల చదవటంవల్ల మంచి ప్రయోజనం కలుగుతుందని దానివల్ల విద్యార్థులు పోటీ పరీక్షలల్లో మంచి విజయాన్ని సాధించగలరని తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ దొసగిరిరావు మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థునులు గ్రంధాలయాలను వియోగించుకోవాలని దీనివల్ల మేధాశక్తిని పెంచుకోవాలని గ్రంధాలయాల ద్వారా ఎటువంటి సమాచారనైనా పొందవచ్చునని, పుస్తకపరంగా కాకుండా, టెక్నాలజీ పరంగా ఇప్పటి గ్రంధాలయాలు అభివృద్ధిచెందయని ఎక్కడినుంచైనా తెలుసుకోవచ్చునని గ్రంధాలయాలు దేశాభివృద్ధికి వెన్నుముక వంటివని తెలియజేశారు.

ఈ పుస్తక ప్రదర్శనలో కళాశాల లైబ్రేరియన్స్ జి. నేరేళ్ళరెడ్డి, యస్.వి. మంజులారాణి, కె. సూర్యనారాయణ, పి. పోలారావు మరియు యమ్. శిరిషా పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ మత్స్య దినోత్సవం

## - అభివృద్ధిని అడుకుంటున్న గవర్నర్




యానాం : ప్రపంచ మత్స్య దినోత్సవాన్ని యానాంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం స్థానిక జిఎంసి బాలయోగి క్రీడా మైదానంలో పుదుచ్చేరి ప్రభుత్వం మత్స్య మరియు మత్స్యకార సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ మత్స్య దినోత్సవ కార్యక్రమానికి పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి క్రిష్ణారావు ముఖ్యఅతిథిగా హాజరయ్యి జ్యోతిప్రజ్వలనుచేసి దినోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సభను ఉద్దేశించి మాట్లాడుతూ పుదుచ్చేరి ప్రభుత్వం మత్స్యకారుల అభ్యునతికి ఏ రాష్ట్ర ప్రభుత్వం అమలుచేయని పథకాలను అమలుచేసి దేశంలోనే నెంబర్ వన్‌గా నిలిచిందన్నారు. 28 సంవత్సరాల క్రితం యానాంలోని మత్స్యకారుల స్థితిగతులు చాలా అధ్వానంగా ఉండేవని వాటిని రూపుమాపానన్నారు. మత్స్యకార గ్రామలలోని అనేక అభివృద్ధి కార్యక్రమాలను పట్టణ ప్రాంతాల మాదిరిగా చేపట్టానన్నారు. త్రాగునీరు సమస్య లేకుండా చేశానన్నారు. అన్ని సదుపాయాలు కల్పనకు కృషిచేశానన్నారు. 100 సంవత్సరాల వరకు త్రాగునీరు కొరతలేకుండా చేశానన్నారు. చదువుకోవాలని ప్రతిఒక్కరిలోనూ చైతన్యం తీసుకొచ్చి ఉన్నత చదువులు చదువుకునేలా సౌకర్యాలు ఏర్పాటుచేశానన్నారు. ఐక్యంగా ఉన్న కులాలను విచ్ఛినం చేయడానికి దుష్టశక్తులు ప్రవేశించి కల్లబొల్లి కబుర్లు చెబుతూ విడదీయడానికి ప్రయత్నిస్తున్నారని వాటిని ప్రతిఒక్కరూ గుర్తించాలన్నారు. ఎవరికి ఏ అపద వచ్చినా వారికి దగ్గరుండి పనిచేసానన్నారు. ప్రస్తుతం పుదుచ్చేరి గవర్నర్ కిరణ్‌బేడి అభివృద్ధి పనులను అడ్డుకోవడమేకాకుండా ప్రభుత్వంపై కక్షసాధింపుచర్యలు చేపడుతుందని ఆరోపించారు. సిఎంతో సహా మంత్రులపైన అనేక తప్పుడుకేసులు బనాయిస్తుందన్నారు. తాను వెల్ఫేర్ మినిష్టర్ కందస్వామి ఈమె చర్యలను బహిరంగంగానే విమర్శిస్తున్నామన్నారు. యానాంలో జరుగుతున్న అనేక అభివృద్ధి పనులను జరగకుండా సూపర్ సిఎంలా వ్యవహరిస్తుందన్నారు. ప్రజలచేత ఎన్నుకోబడిన ప్రభుత్వాన్ని ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తుందన్నారు. ఈ పరిస్థితి మునుపెన్నడూ చూడలేదన్నారు. ఈమె చర్యలను ప్రజలు వ్యతిరేకిస్తున్నారన్నారు. ప్రపంచ మత్స్య దినోత్సవ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, క్రీడాకారులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్రీడాపోటీలో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రధానంచేశారు. అలాగే రాష్ట్రస్థాయి క్రీడాపోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానంచేశారు.

**డ్వాక్రా గ్రూపు సంఘాలకు చెక్కుల పంపిణీ**

యానాంలోని 439 డ్వాక్రా గ్రూపు సంఘాలకు రూ. 24 కోట్ల 46 లక్షలు విలువైన చెక్కులను ఒక్కొక్క గ్రూపు రూ. 5 లక్షలు చొప్పున పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి పరిపాలనాధికారి ఎంవిఎస్ ప్రసాద్, మున్సిపల్ కమీషనర్ జి గౌరీ సరోజిని, ఎస్‌పి నితిన్ గోహల్, విద్యాశాఖ అధికారి కాలే సాయినాద్, పుదుచ్చేరి స్పోర్ట్స్ డిప్యూటీ డైరెక్టర్ లెనిన్ రాజు, గుణసెల్వన్, మత్స్యశాఖ ఇన్‌చార్జి ఎడి డి. దొంతయ్య, తదితరులు పాల్గొన్నారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నృత్య ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి.

# సత్యప్రమోద పాదుకా రథయాత్రకు ఘన స్వాగతం



కాకినాడ : దేశ వ్యాప్త సమాచారంలో భాగంగా ఉత్తరాధిమఠ పూర్వపు స్వామిజీ శ్రీ సత్యప్రమోద తీర్థ శతమానోత్సవ కార్యక్రమంలో భాగంగా నగరానికి మంగళవారం ఉదయం వచ్చిన పాదుకారాధయాత్రకు మధ్వసభ కమిటీ బృందం స్థానిక రామారావుపేటలో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామిజీ రజిత విగ్రహం మరియు పాదుకలను సుధా పండితులు సుళేభావినరసింహాచార్యులు తీసుకురాగా మధ్వసభ భజన మండలి సభ్యులు హారతి యిచ్చారు. కమిటీ కార్యదర్శి కోపల్లి శేషగిరిరావు పూర్ణకుంభంతో రథయాత్ర బృందాన్ని ఆహ్వానించారు. రథయాత్రలో బెంగుళూరు నుండి ఫణిఆచార్, సంతోష్ ఆచార్, రాజన్న, వెంకటేష్‌చార్‌లు వున్నారు. శ్రీ సత్య ప్రమోద తీర్థ స్వామిజీ స్వామిజీ వైభవం పై రూపొందించిన ప్రత్యేక డాక్యుమెంటరీ లేజర్‌షో ద్వారా భక్తులకు వివరించారు. శ్రీ సుధా పండితులు సుళేభావి నరసింహాచార్యులు ప్రసంగిస్తూ మఠ పరంపరలో అయిదు దశాబ్దాలుగా శ్రీ మూల రామ పూజను నిర్విఘ్నంగా నిర్వహించిన మహానుభావులు శ్రీ సత్యప్రమోదులవారన్నారు. తమిళనాడు రాష్ట్రంలో తిరుకోవిలూర్‌లో స్వామిజీ మూల బృందావనం వుందన్నారు. ఈనెల 25న రాజమండ్రికి వస్తారని గోదావరి నదిలో పాదుకాస్నానం చేయ సంకల్పించామన్నారు.

కార్యక్రమంలో కార్యదర్శి శేషగిరిరావు, లోకా రాఘవేంద్రరావు, సంయుక్త కార్యదర్శి జర్నలిస్టు పరశురామ్, కార్యవర్గ సభ్యులు శ్రీమతి గాయత్రి కాశీరావు, రాచూరి శేషగిరిరావు, సుసర్ల రమణ, సుసర్ల చలపతిరావు, కోశాధికారి రాము, రామమూర్తి, అనురాధ, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

# చిత్రభాను

## పబ్లిక్ ఫంక్షన్లో కన్నీళ్ళు పెట్టుకున్న ఐశ్వర్యారాయ్



పబ్లిక్ ఫంక్షన్లో కంటతడి పెట్టిన ఐశ్వర్యారాయ్ మాజీ ప్రపంచ సుందరి ఐశ్వర్యరాయ్, బాలీవుడ్ హీరో అభిషేక్ బచ్చన్ ముద్దుల కూతురు ఆరాధ్య నవంబర్ 16న తన ఆరో పుట్టిన రోజు జరపుకున్న సంగతి తెలిసిందే. ఆరాధ్య బర్త్‌డేని బచ్చన్ ఫ్యామిలీ చాలా గ్రాండ్‌గా నిర్వహించింది. బాలీవుడ్‌కి చెందిన పలువురు సినీ సెలబ్రిటీలు బర్త్‌డే వేడుకలో సందడి చేశారు. ఇక పార్టీకి ఆరాధ్య.. ప్రముఖ డిజైనర్ మనీష్ మల్హోత్రా రూపొందించిన పింక్ గౌన్‌ని ధరించింది. దీని ఖరీదు దాదాపు 60 వేల వరకు ఉంటుందని చెబుతున్నారు. ఇక ఈ గౌనుతో పాటు ఆరాధ్య ధరించిన లెదర్ చియారా ఫ్రీ- వాకర్స్ షూస్ ధర రూ. 20 వేలు అని తెలుస్తుంది. తన ఫాదర్ మరణించిన తర్వాత ఫంక్షన్స్‌కి కాస్త దూరంగా ఉన్న ఐష్ తన కూతురి బర్త్‌డేని మాత్రం తన స్వగృహం ప్రతీక్ష లో అత్యంత గ్రాండ్‌గా నిర్వహించింది. ఆ తర్వాత ఈ అందాల రాణి ఐశ్వర్య రాయ్ ఒక పబ్లిక్ ఈవెంట్లో కన్నీళ్లు పెట్టుకుంది. ఆ తర్వాత దివంగతుడైన తన తండ్రి స్మారకార్థం 100 మంది చిన్నారులకు గ్రహణ మొర్రి శస్త్రచికిత్సలు చేయించాలని ఐష్ నిర?యించుకుంది. దీనికి సంబంధించి ఓ ఆసుపత్రి సౌజన్యంతో ఒక ఈవెంట్ ఏర్పాటు చేసింది ఐష్. ఈ కార్యక్రమానికి మీడియా వాళ్లు కూడా వచ్చారు. ఆమె కన్నీళ్లకు కారణం ఫొటోగ్రాఫర్లే. తన తండ్రి స్మారకార్థం తలపెట్టిన ఒక సేవా కార్యక్రమంలో పాల్గొన్న ఐశ్వర్యను ఫొటోగ్రాఫర్లు అదే పనిగా ఫొటోలు తీస్తుండటంతో ఆమె అసహనానికి గురైంది. ఎంత చెప్పినా ఫొటోగ్రాఫర్లు వినకుండా ఒక ఫ్యాషన్ ఈవెంట్ తరహాలో ఫొటోలు తీస్తూనే ఉండటంతో ఐష్ ఫ్రస్టేట్ అయిపోయింది. కన్నీళ్లు పెట్టుకుంది.పెద్ద ఎత్తున ఫొటోగ్రాఫర్లు విచ్చేసి.. ఐష్ ను అదే పనిగా ఫొటోలు తీయడం మొదలుపెట్టారు. ఇక ఫొటోలు ఆపమని విన్నా వాళ్లు వినలేదు.

## నా మైండ్ దొబ్బింది.. కానీ జ్యూస్ అయిపోలేదు.. రాంగోపాల్ వర్మ






శివ వచ్చిన 28 ఏళ్ల తర్వాత మళ్లీ టాలీవుడ్ కింగ్ నాగార్జున, సెన్సేషనల్ డైరెక్టర్ రాంగోపాల్ వర్మ కాంబినేషన్ మళ్లీ రిపీట్ అయింది. అన్నపూర? స్టూడియోలో శివ సినిమా ముహూర్తం షాట్ కొట్టిన ప్రదేశంలోనే నాగ్, వర్మ చిత్రం ఓపెనింగ్ షాట్‌ను కొట్టడం విశేషం. ఈ సెన్సేషనల్ మూవీ ప్రారంభానికి పెద్ద మొత్తంలో మీడియా, అభిమానులు, సినీ ప్రముఖులు తరలి రావడంతో అన్నపూర? స్టూడియో సందడిగా మారింది. శివ చిత్రానికి రాంగోపాల్ వర్మ తండ్రి ముహూర్తం షాట్‌కు క్లాప్ కొట్టగా, ఈ చిత్రానికి ఆయన (ఆర్జీవి) తల్లి ఓపెనింగ్ షాట్‌కు హాజరయ్యారు. ముహూర్తం షాట్ సందఠరేగా తొలి సన్నివేశంలో నాగార్జున చెప్పిన డైలాగ్ సింగిల్ టేక్‌లో ఓకే అయింది. 'నా ప్రశ్నలకు సమాధానం చెప్పిన చెప్పకపోయినా నీవు చావడం మాత్రం ఖాయం.



## నేను కంఫర్టబుల్‌గానే ఉన్నాను

పద్మావతి సినిమాకి వస్తున్న బజ్ మామూలుగా లేదు, ఇప్పటికిప్పుడు బాలీవుడ్‌లో బాహుబలి తర్వాత అంతటి హైప్ తెచ్చుకున్న సినిమా ఇదే. బాలీవుడ్ ఇప్పుడు బాహుబలి దెబ్బకి ప్రతీకారం తీర్చుకోవాలన్నత కసిగా ఉంది. ఈ సంవత్సరం వచ్చిన పెద్దపెద్ద సినిమాలు కూడా బాక్సాఫీస్ దగ్గర ఘోరమైన పరాజయం పొందాయి. "టాయిలెట్ ఏక్ ప్రేమ్ కథా" తప్ప ఈ సంవత్సరం మొత్తం మీద చెప్పుకోదగిన హిట్ ఇప్పటికీ తగల్లేదు. ఇక ఈ సంవత్సరానికి ఆశలు కూడా లేవు అందుకే పద్మావతి తో అయినా ఆ స్థాయి హిట్ కొట్టాలన్న తపనతో ఉందిబాలీవుడ్. అందుకే అదే పనిగా ప్రమోషన్లని ఇరగ దీస్తున్నారు కోట్లకొద్దీ రూపాయలు కేవలం ప్రమోషన్ కోసమే పెడుతున్నారు.. ఇవన్నీ చూసాకే దీపికా కి డబ్బులంటే విరక్తి వచ్చేసిందేమో డబ్బులమీద అసలు ఇష్టమే లేకుండా పోయిందంటూ చెబుతోంది... రీసెంట్ గా ఈ చిత్రానికి 3డీ వెర్షన్ ట్రైలర్ రిలీజ్ చేయగా.. ఆ కార్యక్రమంలో పాల్గొన్న దీపికా పదుకొనే.. 'నా రెమ్యూనరేషన్ గురించి మాట్లాడ్డం నాకు అంత ఎగ్జయిటింగ్ గా అనిపించడం లేదు. వారు నాకు ఇచ్చిన మొత్తంపై నేను కంఫర్టబుల్ గానే ఉన్నాను' అని చెప్పింది దీపిక. ఈ చిత్రంపై దర్శక నిర్మాతలు వెచ్చించిన మొత్తం.. పెట్టుబడి చూసి.. తనపై ఇంతగా ఇన్వెస్ట్ చేసినందుకు గర్వంగా ఫీలవుతున్నట్లు దీపికా పదుకొనే చెప్పింది. ఇండియన్ స్క్రీన్ పై ఇదో బిగ్గెస్ట్ మూవీ అంటున్న దీపిక.. ఈ సినిమా ఇండియన్ సినిమాకు టర్నింగ్ పాయింట్ అవుతుందని నమ్మకంగా ఉన్నానని అంటోంది.

ఇక ఈ చిత్రంలో యూనిబ్రో లుక్ లో కనిపించడంపై విమర్శలు రావడంపై కూడా దీపిక రియాక్ట్ అయింది. మహిళలపై కండిషన్స్ మామూలే ఇలాంటివి పట్టించుకోనని తేల్చేసింది.

అయితే.. తాను బాజీరావు మస్తానీ చిత్రంలో మస్తానీ పాత్ర కంటే పద్మిని పాత్ర కోసమే ఎక్కువగా కష్టపడ్డానని తెలిపింది. ఇటు సంప్రదాయాలు.. సంస్కృతి వంటివి పాటిస్తూనే.. యుద్ధం చేయకుండానే.. గౌరవాన్ని నిలుపుకుని.. నిలబెట్టాల్సిన ఈ రోల్ తన కెరీర్ లోనే బిగ్గెస్ట్ ఛాలెంజ్ అంటోంది దీపికా పదుకొనే.

## పవిత్ర పుణ్యక్షేత్రంలో టైటిల్..



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో ఓ చిత్రం తెరకెక్కుతున్న బిజీగా షూటింగ్ జరుపుకొంటున్నది. ఈ చిత్రాన్ని 2018 జనవరి 10వ తేదీన రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. అయితే ఈ సినిమా టైటిల్‌పై ఇంకా ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది. ఇప్పటికే రకరకాల పేర్లు మీడియాలో వినిపిస్తున్నప్పటికీ.. చిత్ర యూనిట్ నుంచి ఎలాంటి స్పందన లేదు. అయితే ఈ చిత్ర టైటిల్ ప్రకటన గురించి ఆసక్తికరమైన వార్త ప్రచారంలో ఉంది. జల్సా, అత్తారింటికి దారేది చిత్రాల తర్వాత పవన్, త్రివిక్రమ్ కాంబో హ్యాట్రిక్‌కు సిద్ధమవుతున్నది. ఈ చిత్రానికి సంబంధించిన టాకీ పార్ట్ దాదాపు పూర్తికావొచ్చింది. డిసెంబర్‌లో పాటల చిత్రీకరణకు చిత్ర యూనిట్ వెళ్లనున్నది. సినిమా షూటింగ్ ఫినిషింగ్ టచ్‌కు వచ్చినప్పటికి సినిమా టైటిల్ ఏమిటనే విషయాన్ని ప్రకటించకపోవడంతో అభిమానుల ఆలోచనలకు అంతేలేకుండా పోతుంది. పవన్, త్రివిక్రమ్ సినిమా టైటిల్ గురించి ఒక్కొక్కరు ఒక్కో రకంగా ఊహించుకుంటున్నారు. ప్రస్తుతం అజ్ఞాతవాసి అనే వర్కింగ్ టైటిల్ జోరుగా సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో చిత్ర టైటిల్‌ని వారణాసిలో ప్రకటించనున్నట్టు తెలుస్తుంది.

## ప్రపంచ సుందరి అందం అదరహో



## రెజీనాతో అఫైర్.. నారా రోహిత్ క్లారిటీ..

అందాల తార రెజీనా కసాండ్రాతో అఫైర్ వార్తలు మీడియాలో ఇటీవల బాగానే వినిపిస్తున్నాయి. ఆ మధ్యలో మెగా హీరో సాయిధరమ్ తేజ్‌తో రెజీనా పెళ్లి జరుగబోతున్నదనే వార్తలు సోషల్ మీడియాలో గుప్పుమన్నాయి. తాజాగా నారా రోహిత్‌తో రెజీనా అఫైర్ సాగుతున్నదనే వార్త సంచలనంగా మారింది. రెజీనాతో లవ్ అఫైర్ నడుస్తోంది అని వస్తున్న వార్తలపై తాజాగా నారా రోహిత్ స్పందించారు. రెజీనాతో అఫైర్ అని వైరల్ అవుతున్న వార్తలు నా దృష్టికి వచ్చాయి. ఈ వార్తల్లో వాస్తవం లేదు. నేనేమీ సీరియస్‌గా తీసుకోలేదు అని నారా రోహిత్ అన్నారు. గతంలో రెజీనాతో శంకర, జో అచ్యుతానంద చిత్రాల్లో నటించా. ప్రస్తుతం బాలకృష్ణుడు సినిమాల్లో కలిసి నటిస్తున్నాను. మొదటి సినిమా నుంచి ఈ గాసిప్ వినిపిస్తున్నది అని రోహిత్ అన్నారు. అదే కారణమై ఉంటుంది. తరుచుగా మేమిద్దరం కలిసి నటిస్తున్నాం. రూమర్, గాసిప్స్ వైరల్ కావడానికి ఇది కూడా ఒక కారణం అయి ఉంటుంది. మేము ప్రొఫెషనల్ రిలేషన్ షిప్ షేర్ చేసుకున్నాం. అది తప్ప మా మధ్య మరో విషయం లేదు అని రోహిత్ తెలిపారు. సాయిధరమ్ తేజ్‌తో అఫైర్ కాగా, సుబ్రమణ్యం ఫర్ సేల్ చిత్ర షటింగ్‌లో రెజీనా, సాయి ధరమ్ తేజ్ ప్రేమలో పడ్డారు. ఆ తర్వాత పెద్దలకు తమ ప్రేమ విషయం చెప్పి ఒప్పించినట్టు గాసిప్స్ వినిపించాయి. రెజీనా కసాండ్రా స్పందన ఇదే.. తనపై వస్తున్న గాసిప్స్‌పై ఆ మధ్య రెజీనా కూడా స్పందించారు. సాయిధరమ్ తేజ్ కేవలం ఉన్న ప్రొఫెషనల్ రిలేషన్ షిప్ మాత్రమే అనే స్పష్టం చేశారు. తన దృష్టి అంతా ప్రస్తుతం కెరీర్‌పైనే అని రెజీనా వివరణ ఇచ్చారు.



# విశాఖలో విజి'లెన్స్' సోదాలు ..

- హోటళ్లపై దాడి.. సిలెండర్ల స్వాధీనం
- హోటల్ నిర్వాహకులపై కేసు నమోదు



విశాఖపట్నం : నగరంలో నిర్వహిస్తున్న పలు హోటల్‌ల్లో మంగళవారం ఉదయం విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్ అదికారులు సోదాలు నిర్వహించారు. గృహావసరాల గురించి వినియోగించాల్సిన గ్యాస్ సిలండర్లను హోటల్‌లో వినియోగించడాన్ని గుర్తించిన అదికారులు మొత్తం 23 గ్యాస్ సిలిడర్లను సీజ్ చేసినట్లు అదికారులు వెల్లడించారు . ఈ మేరకు గ్రేటర్ విశాఖ కప్పరాడ పరిధి 35 , 37 వార్డులలో కొన్ని హోటల్‌ల్లో సోదాలు నిర్వహించిన అదికారులు 16 గ్యాస్ సిలిండర్లు సీజ్ చేయగా 3వ పట్నం పోలీస్ స్టేషన్ పరిధి ఒక ప్రముఖ హోటల్‌లో 7 గ్యాస్ సిలిండర్లు స్వాధీన పరుచుకొని హోటల్ నిర్వాహకులపై కేసులు నమోదు చేసారు. సోదాల్లో సీజ్ చేసిన గ్యాస్ సిలిండర్లను సివిల్ సప్లై అధికారులకు అప్పగించారు . ఈ సోదాల్లో విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్ సి.ఐ లు మల్లికార్జునరావు, శ్రీనివాశరావు, ఎస్ .ఐ రమేష్ , తహశీల్ధార్ సుమబాల, ఆర్ .ఐ అనిల్ సిబ్బంది పాల్గున్నారు.

## 'బాటిలినమ్ టాక్సిన్' పై గీతం వైద్య కళాశాల వర్క్‌షాప్

గీతం యూనివర్శిటీః పక్షవాతం ఇతరత్రా నరాల సంబంధమైన సమస్యల కారణంగా మొహంలో వచ్చే మార్పులను అనారోగ్య సమస్యలను ఏవిధంగా తొలగించ వచ్చో తెలియజేసే, 'బాటిలినమ్ టాక్సిన్' పై నవంబర్ 25వ తేదీన గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌స్ అండ్ రీసెర్చి ఆద్వర్యంలో వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు వర్క్‌షాప్ కన్వీనర్ డాక్టర్ వి.గౌతమ్ తెలిపారు. ఈ వర్కషాప్‌లో తిరుపతి స్విమ్స్ న్యూరాలజీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ టి.నవీన్, మణిపాల్ కస్తూరిబా వైద్య కళాశాల న్యూరాలజీ విభాగం అధిపతి డాక్టర్ జి.శంకర ప్రసాద్, నారాయణ వైద్యకళాశాల న్యూరాలజీ విభాగం అధిపతి డాక్టర్ ఎన్.ఎస్. సంపత్ కుమార్ తదితరులు హాజరై ప్రధాన ప్రసంగం చేస్తారని తెలిపారు. నరాల సమస్యల వల్ల మొహంలో తలెత్తే సమస్యలను వైద్య శాస్త్రంలో ఏవిధంగా పరిష్కరించవచ్చో తెలిపే శస్త్ర చికిత్సలను ప్రత్యక్ష ప్రసారం ద్వారా తెలియజేస్తామన్నారు.

అంతర్జాతీయ టెస్టు ర్యాంకింగ్స్‌లో

# కోహ్లికి ఐదో స్థానం

వార్నర్‌ను వెనక్కునెట్టిన కోహ్లి!



దుబాయ్: అంతర్జాతీయ టెస్టు ర్యాంకింగ్స్‌లో భారత కెప్టెన్ విరాట్ కోహ్లి ఐదో స్థానాన్ని ఆక్రమించాడు. శ్రీలంకతో తొలి టెస్టు అనంతరం విడుదల చేసిన ఐసీసీ ర్యాంకింగ్స్ లో కోహ్లి తన స్థానాన్ని మెరుగుపరుచుకుని టాప్-5కు చేరాడు. లంకేయులతో ఈడెన్ గార్డెన్ లో జరిగిన మొదటి టెస్టు మ్యాచ్ లో కోహ్లి శతకం సాధించాడు. ఫలితంగా 807 రేటింగ్ పాయింట్లతో కోహ్లి ఐదో స్థానానికి ఎగబాకాడు. ఈ క్రమంలోనే ఆసీస్ స్టార్ ఓపెనర్ డేవిడ్ వార్నర్ ను వెనక్కునెట్టాడు. ప్రస్తుతం కోహ్లి ఐదో స్థానంలో నిలవగా, వార్నర్ ఆరో స్థానంలో ఉన్నాడు.

ఇక్కడ ఆసీస్ కెప్టెన్ స్టీవ్ స్మిత్ 936 రేటింగ్ పాయింట్లతో తొలి స్థానంలో కొనసాగుతుండగా, ఇంగ్లండ్ ఆటగాడు జో రూట్ (889 రేటింగ్ పాయింట్లు) రెండో స్థానంలో, న్యూజిలాండ్ కెప్టెన్ కేన్ విలియమ్సన్ (880) మూడో స్థానంలో ఉన్నాడు. ఇక భారత మిడిల్ ఆర్డర్ ఆటగాడు చతేశ్వర్ పుజారా(866 రేటింగ్ పాయింట్లు) నాల్గో స్థానాన్నినిలబెట్టుకోగా, కేఎల్ రాహుల్ ఎనిమిదో స్థానంలో నిలిచాడు. ఇక బౌలర్ల ర్యాంకింగ్స్ లో రవీంద్ర జడేజా ఒక స్థానం దిగజారి మూడో స్థానంలో నిలవగా, అశ్విన్ నాల్గో స్థానాన్ని కాపాడుకున్నాడు.

## బీజేపీ నేతపై ఎఫ్ఐఆర్

గురుగ్రామ్: 'పద్మావతి' చిత్రంలో టైటిల్ పాత్రధారిణి దీపిక పదుకొనే, దర్శకుడు సంజయ్ లీలా బన్సాలీ తలలకు రూ.10 కోట్లు రివార్డు ప్రకటించిన బీజేపీ నేత సూరజ్ పాల్ అముపై మంగళవారం ఎఫ్ఐఆర్ నమోదైంది. గురుగ్రామ్‌కు చెందిన ఒక వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆయనపై ఈ ఎఫ్ఐఆర్ దాఖలైంది. ఆదివారం ఒక ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్న అము... దీపిక తల నరికితే రూ.10 కోట్లు ఇస్తానని ప్రకటించారు. ఈ వ్యాఖ్యలు సంచలనం సృష్టించడంతో బీజేపీ సైతం ఆయనను మందలించింది. క్షమాపణ చెప్పాలని ఆదేశించింది.

# 108 అడుగుల హనుమాన్ విగ్రహాన్ని తరలించండి!

## విగ్రహం చుట్టూ అక్రమ కట్టడాలపై ఢిల్లీ హైకోర్టు మండిపాటు

## ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై విచారణ, తీర్పు



న్యూఢిల్లీ: దేశ రాజధానిలో అక్రమ కట్టడాలపై ఢిల్లీ హైకోర్టు మండిపడింది. దీనిపై మంగళ వారం విచారణ జరిపిన కోర్టు.. కరోల్ భాగ్‌లో ఉన్న 108 అడుగుల హనుమంతుని విగ్రహాన్ని అక్కడి నుంచి తరలించడంపై దృష్టిసారించాలని అధికారులను ఆదేశించింది. వాయు మార్గంలో ఈ భారీ విగ్రహాన్ని తరలించే దిశగా పరిష్కారం ఆలోచించండి అని స్పష్టంచేసింది. ఆ విగ్రహం చుట్టుపక్కలే ఆక్రమణలు ఎక్కువగా ఉండటంతో హైకోర్టు ఈ పరిష్కారాన్ని సూచించింది. అమెరికాలోనూ ఇలాగే భారీ కట్టడాలను తరలించారని ఈ సందర్భంగా ధర్మాసనంలోని న్యాయమూర్తులు జస్టిస్ గీతా మిట్టల్, జస్టిస్ హరిశంకర్ తెలిపారు. కరోల్ భాగ్‌లో ఉన్న అక్రమ కట్టడాలను తొలగించేలా చూడాలని ఓ ఎన్‌జీవో దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై ఢిల్లీ హైకోర్టు విచారణ జరిపింది. ఆ విగ్రహాన్ని వాయు మార్గంలో తరలించే అవకాశం ఉందేమో చూడండి. దీనిపై లెఫ్ట్‌నెంట్ గవర్నర్‌తో మాట్లాడండి. అమెరికాలో ఇలాగే భారీ కట్టడాలను తరలించారు అని ధర్మాసనం చెప్పింది. ఒక్కచోటైనా ఇలా అక్రమ కట్టడాలను తొలగిస్తే ఢిల్లీ ప్రజల మనస్తత్వం మారుతుందని కార్పొరేషన్ అధికారులతో స్పష్టంచేసింది. ఇప్పటికే ఎన్నోసార్లు ఈ విషయాన్ని చెప్పినా మున్సిపల్ కార్పొరేషన్లు ఆ దిశగా ఎలాంటి ముందడుగు వేయలేదని కోర్టు అసంతృప్తి వ్యక్తంచేసింది.

## హర్భజన్ సింగ్‌కు సారీ చెప్పిన గంగూలీ



కోల్‌కతా: టీమిండియా మాజీ సారథి సౌరవ్ గంగూలీ ఒకప్పటి తన సహచరుడు హర్భజన్ సింగ్‌కు సారీ చెప్పాడు. హర్భజన్ సింగ్ తన భార్య, కుమార్తెతో కలిసి ఉన్న ఓ ఫొటోను ట్విట్టర్‌లో పోస్ట్ చేశాడు. ఈ ఫొటోలకు దాదా కామెంట్ రాస్తూ.. బాబు చాలా అందంగా ఉన్నాడు.. బోల్డంత ప్రేమ పంచాలి అని ట్వీట్ చేశాడు. ఆ తర్వాత కొంతసేపటికే తన తప్పును తెలుసుకుని క్షమాపణలు వేడుకున్నాడు. తన ట్వీట్‌ను సరిచేస్తూ మాఫ్ కర్నా.. బేటీ బహుత్ సుందర్ హై (క్షమించాలి.. పాప చాలా అందంగా ఉంది) అని సరిచేశాడు.



# భాష మెరుగైన అవగాహనకు ఉపకరిస్తుంది

## వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు

ఆంధ్రా యూనివర్శిటీః భాష మెరుగైన అవగాహనకు ఉపకరిస్తుందని ఏయూ వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు అన్నారు. మంగళవారం ఉదయం ఏయూ మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో నిర్వహిస్తున్న భాష, సాహిత్యం రిఫ్రెషర్ కోర్సును ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ మెథడాలజీ ఎంతో ప్రధానమన్నారు. బోధన నైపుణ్యం మెరుగు పరచుకుంటూ విద్యార్థులు సమర్ధవంతంగా అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులను ఆకట్టుకునే విధంగా తమ బోధనతో అధ్యాపకులు ఆసక్తికి కలిగించడం ఎంతో అవసరమన్నారు. బోధన విధానాలను తెలుసుకోవడానికి ఈ శిక్షణ తరగతులు ఎంతగానో ఉపయుక్తంగా నిలుస్తాయన్నారు. క్రమశిక్షణకు ప్రాధాన్యం అందిస్తూ ముందుకు సాగాలని సూచించారు.

కేంద్రం సంచాలకులు ఆచార్య పి.విశ్వనాథం మాట్లాడుతూ నిరంతరం అధ్యాపకులకు ఉపయుక్తమైన శిక్షణ తరగతులను నిర్వహించడం జరుగుతోందన్నారు. నిపుణులతో ప్రత్యక్ష శిక్షణ అందించి అధ్యాపకుల సామర్ధ్యాలను పెంపుదల చేయడం జరుగుతోందన్నారు. దేశంలోనే ప్రధమ స్థానంలో ఏయూ హెచ్ఆర్‌డిసి కేంద్రాన్ని నిలుపుతామన్నారు.

శిక్షణ కార్యక్రమం సమన్వయకర్త సాలమన్ బెన్ని మాట్లాడుతూ అధ్యాపకుల బోధన సామర్ధ్యాలను పెంపుదల చేయడం జరుగుతోదన్నారు. తరగతిలో వెనకబడిన విద్యార్థులను సైతం దృష్టిలో ఉంచుకుని అధ్యాపకుని బోధన సాగాల్సిన అవసరం ఉంటుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎన్.ఏ.డి పాల్, హరనాథ్ తదితరులు పాల్గొన్నారు. తెలుగు, హిందీ, సంస్కృతం, ఒరియా భాషలకు చెందిన అధ్యాపకులు శిక్షణ తరగతులకు హాజరయ్యారు.

# గీతం విద్యార్థుల 'డిజిధాన్'




గీతం యూనివర్శిటీః నెల 24, 25 తేదీలలో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో నిర్వహించనున్న కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా విద్యార్థి విభాగం రాష్ట్ర స్థాయి సమావేశాలకు సన్నాహకంగా గీతం కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విద్యార్థుల ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఆర్‌కె బీచ్ వద్ద 'డిజిధాన్' పేరిట వాక్‌ధాన్‌ను నిర్వహించారు. గీతంతో పాటు నగరంలోని వివిధ ఇంజనీరింగ్ కశాశాలకు చెందిన విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్న ఈ కార్యక్రమాన్ని గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.లక్ష్మీప్రసాద్ ప్రారంభించారు. 'ఏ స్టెప్ టూ వర్డ్స్ డిజిటలైజేషన్' పేరిట జరిగే సి.ఎస్.ఐ రాష్ట్ర స్థాయి సమావేశాలు విద్యార్థులకు కొత్త దిశా నిర్ధేశం చేయగవన్న ఆకాంక్షను ఆయన వ్యక్తం చేశారు.

కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం అధిపతి ప్రొఫెసర్ పి.వి.నాగేశ్వరరావు, సిఎస్ఐ విద్యార్థి విభాగం ఫ్యాకల్టీ సలహదారు ప్రొఫెసర్ ఆర్.శిరీష, ఫాకల్టీ కోఆర్డినేటర్ కె.నీలిమా సంతోషి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ పోఫెసర్ జి.వీరేశ్వర స్వామి తదితరులు పోల్గొన్నారు.

డిజిటలైజేషన్ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించే ప్లకార్డులను విద్యార్థులు వాక్ ధాన్‌లో ప్రదర్శించారు.

# వాళ్లది తప్పయితే.. భన్సాలీది తప్పే

## యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్



లక్నో: సంజయ్ లీలా భన్సాలీ లేటెస్ట్ మూవీ పద్మావతిని ఓ బీజేపీ పాలిత రాష్ట్రం మధ్యప్రదేశ్ ఇప్పటికే నిషేధించగా.. మరో బీజేపీ పాలిత రాష్ట్రం ఉత్తరప్రదేశ్ ఆ చిత్రాన్ని తప్పుబట్టింది. భన్సాలీ తల తెస్తే బహుమతి ఇస్తామని ప్రకటిస్తున్నవారు చేస్తున్నది తప్పయితే భన్సాలీ చేసింది కూడా తప్పేనని యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ అన్నారు.

అయితే దీనిపై ప్రతిపక్ష సమాజ్‌వాదీ పార్టీ స్పందిస్తూ.. ప్రభుత్వం తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి పద్మావతి వివాదాన్ని రేపుతున్నదని ఆరోపించింది. ఈ మూవీపై యోగి ఇవాళ ఓ టీవీ చానెల్ ఇంటర్వ్యూలో స్పందించారు. యూపీలో ఉన్న 22 కోట్ల మంది సెంటిమెంట్లను సెన్సార్ బోర్డు పరిగణనలోకి తీసుకోవాలి. ఈ సినిమాపై మా అభ్యంతరాలను చెబుతూ ఇప్పటికే మేము కేంద్రానికి లేఖ కూడా రాశాం. భన్సాలీ తలపై బహుమతి ప్రకటించడం తప్పయితే.. భన్సాలీ చేసింది కూడా తప్పే అని యోగి స్పష్టంచేశారు.

# కీచక పీఆర్వోపై వేటు పడింది

హైదరాబాద్: మంత్రి పద్మారావు పీఆర్వో పీలి కృష్ణపై వేటు పడింది. తన పీఆర్వోగా వ్యవహరిస్తున్న కృష్ణను ఆ పోస్ట్ నుంచి తొలగించాలంటూ అధికారులను మంత్రి పద్మారావు ఆదేశించారు. మంత్రి ఆదేశాలతో అధికారులు కృష్ణపై చర్యలకు ఉపక్రమించారు. మంత్రి పద్మారావు పీఆర్వోగా వ్యవహరిస్తున్న కృష్ణ ఓ కేసు విషయంలో మరో మంత్రి జోగు రామన్ననే బెదిరించాడు. అంతేకాదు.. తనను చూస్తే జోగు రామన్న భయపడుతున్నారంటూ తన అనుచరుల వద్ద ప్రచారం చేసుకున్నాడు. మంత్రి పేరు చెప్పుకొని సొంత పేషీలో, స్వగ్రామంలో అరాచకాలు సృష్టించాడు. అమాయకుడిపై తప్పుడు కేసు పెట్టించి ఇబ్బందులకు గురిచేశాడు. ఈ వ్యవహారాన్ని వెలుగులోకి తేవడంతో ప్రభుత్వం దీన్ని సీరియస్‌గా తీసుకుంది. ఈ క్రమంలోనే కృష్ణపై వేటు వేసింది.




VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of VIJAYABHANU PUBLICATIONS PVT. LTD., Published and Printed at VIJAYABHANU PRESS, D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com